మంగళవారం

11-3-2025

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 169

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

# విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం



మల్టీకలర్ ప్రింటింగ్

ఇప్పుడు మన విశాలాంధ్రలో

మ్యాగ్జైన్స్

లామినేషన్

గమ్ బైండింగ్

బుక్ వర్క్స్

మరియు

పోస్టర్లు

పాంప్లేట్స్

ప్రింట్ చేయబడును

సంప్రదించండి : 94405 73343

## 'ఎక్స్' సేవలకు అంతరాయం

**న్యూఢిల్లీ:** ప్రముఖ మైక్రో బ్లాగింగ్ సైట్ 'ఎక్స్ (గతంలో ట్విటర్)' సేవలకు అంతరాయం ఏర్పడింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సోమవారం ఈ సమస్య తలెత్తింది. 'ఎక్స్' ఖాతాలు తెరవగానే ఖాళీ పేజీ దర్శనమిస్తోందని కొంతమంది

- మిగతా 2 లో

## ఐపీఎల్‌లో పొగాకు యాడ్‌లపై నిషేధం: కేంద్రం

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ మ్యాచ్‌ల సందర్భంగా పొగాకు, మద్యం యాడ్‌లపై నిషేశం విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌ల ప్రసారం సమయంలో వచ్చే పొగాకు, మద్యం అడ్వర్టయిజ్‌మెంట్లపై నిషేధం విధించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐపీఎల్ చైర్‌పర్సన్‌కు కేంద్ర

- మిగతా 2 లో

# ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ఎమ్మెల్యే కోటాలో అన్ని పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థులు సోమవారం తమ నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి, మిత్రపక్షమైన సీపీఐ నుంచి నెలకంటి సత్యం, బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ కుమార్... శాసనసభ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థుల వెంట సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీపీఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి, వీర్లపల్లి శంకర్ ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంట కేటీఆర్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు టి. హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస యాదవ్, మల్లారెడ్డి ఉన్నారు.

### ప్రణయ్ హత్యకేసు

# ఏ2కు మరణ దండన

- మరో ఆరుగురికి జీవిత ఖైదు
- ఆరేళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు

**విశాలాంధ్ర-నల్గొండ:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ప్రణయ్ హత్య కేసులో ఆరేళ్ల తర్వాత నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు

- మిగతా 2 లో

# అసెంబ్లీకి కేసీఆర్ వస్తారు

### రేవంత్ చుట్టూ నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు : కేటీఆర్

**విశాలాంధ్ర - హైదరాబాద్:** రాబోయే బడ్జెట్ సమావేశాలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మీడియాతో సోమవారం ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మోదీని మంచోడు అనకపోతే జైల్లో వేస్తాడు, కిషన్ రెడ్డి ఆ పని చేయలేదు ఆయన నిస్సహాయుడని వ్యాఖ్యానించారు. తొలుత వరంగల్ ఎయిర్ పోర్ట్ కు కృషి చేసింది తామని, కానీ కాంగ్రెస్‌వాళ్లు పేరు పెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి వెనక నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని, ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ తీసుకు వచ్చేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. టీడీఆర్ ఎక్కడెక్కడ ఉన్నాయో ఆయన చుట్టూ ఉన్న నలుగురు బ్రోకర్లు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణానికి నలుగురు బ్రోకర్లతో సీఎం తిరుగుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ స్థానానికి దాసోజు శ్రవణ్ ను 2023లో నామినేట్ చేశామని ... అప్పుడు బీజేపీ ఆపిందని, అందుకే కేసీఆర్ మళ్లీ గుర్తించి ఆయనకు అవకాశం ఇచ్చారన్నారు. రేవంత్ మాట ఢిల్లీలో నడవటం లేదు, కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారని రాహుల్ గాంధీ అన్నారని, ఎక్కే విమానం

- మిగతా 2 లో

### నిధుల కోసం ఢిల్లీలో

# ధర్నాకు సిద్ధం

- పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే ఏపీతో సమస్యలుండేవి కాదు
- రాష్ట్రాభివృద్ధిపై చర్చకు కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి
- ఎన్‌హెచ్ భూసేకరణకు ఈటలే అడ్డు: రేవంత్ రెడ్డి

**విశాలాంధ్ర-హైదరాబాద్:** గత పదేళ్ల పాలనలో ప్రాజెక్టులు కట్టి ఉంటే నేడు ఆంధ్రప్రదేశ్‌తో సమస్యలు వచ్చేవి కావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీఎల్పీలో సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పరిమితమైన కేటాయింపులు ఉంటాయని... అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుగుతున్నామని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఇచ్చిన హామీ మేరకే నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు సీఎం పేర్కొన్నారు. 39 సార్లు కాకుంటే 99 సార్లు ఢిల్లీ పోతాం... తప్పేంటని ప్రశ్నించారు. సందర్భం వస్తే నిధుల విషయంలో ఢిల్లీలోనైనా ధర్నా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 'మెట్రో' తెచ్చానన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డినే నిధులు అడుగుతున్నాం... ఎన్‌హెచ్ భూసేకరణకు అడ్డుపడుతున్నది ఈటల రాజేందర్ కాదా అని ప్రశ్నించారు. భూసేకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని అన్నప్పుడు మాతో చర్చించాలన్నారు. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కిషన్ రెడ్డి ఎందుకు రాలేదని నిలదీశారు. కేసీఆర్

- మిగతా 2 లో

### గురుప్రీత్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

2లో

### గోవా విముక్తి ఉద్యమ యోధుడు చిటాలే

గోవా విముక్తి కోసం సీపీఐ నిర్వహించిన సత్యాగ్రంలో మొదటి బృందానికి నాయకత్వం వహించింది విష్ణు దామోదర్ చిటాలే. ఈ బృందంలో వెయ్యి మంది పాల్గొన్నారు. ఇందులో అప్పటికి విద్యార్థిగా ఉన్న గోవింద్ పన్సారే కూడా పాల్గొన్నారు. ఈ సత్యాగ్రహంలో భగత్‌సింగ్ సన్నిహిత సహచరుడైన కమ్యూనిస్టు నాయకుడు పండిట్ కిశోరీలాల్ కూడా ఉన్నారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో


SRM UNIVERSITY AP Andhra Pradesh | Carnegie Mellon University School of Computer Science

SRM AP, AMARAVATI LANDMARK COLLABORATION WITH CARNEGIE MELLON UNIVERSITY'S SCHOOL OF COMPUTER SCIENCE, USA FOR

AI RESEARCH LAB

A collaboration to drive novel AI research, innovation and education to shape future AI leaders and redefine the technological landscape

ADVANCED AI RESEARCH LAB

Establishing a state - of - the - art AI lab incorporating the latest advancements in AI and emerging technologies for pioneering research and innovation, inspired by CMU SCS's cutting-edge research ecosystem.

DEEPER FACULTY ENGAGEMENT

Faculty engage with CMU SCS's AI academia and research environment, redefining acadmic programs and advancing AI education at SRM AP.

DISTINCTIVE RESEARCH INTERNSHIPS

SRM AP Students intern at CMU SCS's AI labs in the United States gaining hands-on experience and working alongside world-class AI experts on real-world challenges.

Shaping the Future of AI - Together !

SRM AP, AMARAVATI: Neerukonda, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh 522240 | CARNEGIE MELLON UNIVERSITY - SCS: 5000 Forbes Ave, Pittsburgh, PA 15213, USA

# రష్యాలో బ్రిటన్ దౌత్యవేత్తల బహిష్కరణ

మాస్కో: గూఢచర్యం ఆరోపణలపై ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను తమ దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. వారు రెండు వారాల్లోగా తమ దేశం వదిలి వెళ్లిపోవాలని పేర్కొంది. ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు మాత్రం ఈ ఇద్దరు దౌత్యవేత్తలు తప్పుడు సమాచారం ఇచ్చి రష్యాలోకి ప్రవేశించారని చెబుతున్నారు. వీరు గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. వారు రష్యా భద్రతకు ప్రమాదకరంగా పరిణమించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ విదేశాంగశాఖ బ్రిటన్ దౌత్యకార్యాలయానికి సమన్లు పంపినట్లు పేర్కొంది. మరోవైపు ఈ పరిణామాలపై తక్షణమే స్పందించేందుకు బ్రిటన్ దౌత్యకార్యాలయం నిరాకరించింది. గతంలో కూడా బ్రిటన్ దౌత్యవేత్తలపై మాస్కో ఇటువంటి ఆరోపణలే చేయగా... బ్రిటన్ ఖండించింది. అమెరికాతో చర్చలు మొదలుపెట్టిన తర్వాత రష్యా బహిష్కరించిన పశ్చిమ దేశాలకు చెందిన తొలి దౌత్యవేత్తలు వీరే.

# కెనడా నూతన ప్రధాని మార్క్ కార్నీ

ఒట్టావా: కెనడాలో అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎన్నికయ్యారు. దీంతో తదుపరి కెనడా ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రధాని పదవి నుంచి వైదొలగనున్నట్లు జస్టిన్ ట్రూడో జనవరిలో ప్రకటించిన నేపథ్యంలో లిబరల్ పార్టీ నూతన సారథి ఎన్నిక అనివార్యమైంది. ఇందులో బ్యాంక్ ఆఫ్ కెనడా మాజీ గవర్నర్ మార్క్ కార్నీ విజేతగా నిలిచారు. 59 ఏళ్ల కార్నీ రెండో స్థానంలో ఉన్న క్రిస్టియా ఫ్రీలాండ్‌ను ఓడించి పార్టీ నూతన సారథిగా ఎన్నికయ్యారు. దీంతో తొమ్మిదేళ్ల ట్రూడో పాలనకు తెరపడింది. మొత్తం 150,000 పార్టీ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, కార్నీకు 131,674 ఓట్లు వచ్చాయి. ఇవి 85.9 శాతంతో సమానం. రెండో స్థానంలో ఉన్న క్రిస్టియా ఫ్రీలాండ్ 11,134, కరినా గౌల్డ్‌కు 4,785, ఫ్రాంక్ బేలిస్‌కు 4,038 ఓట్లు వచ్చాయి. డొనాల్డ్ ట్రంప్ నుంచి సుంకాల ముప్పు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కార్నీ 24వ ప్రధానిగా కెనడా పాలన పగ్గాలు చేపట్టనున్నారు. 1965లో ఫోర్ట్ స్మిత్‌లో జన్మించిన మార్క్ కార్నీ, హార్వర్డ్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. గోల్డ్‌మన్ శాక్స్‌లో 13 ఏళ్లు పనిచేసిన కార్నీ, 2003లో బ్యాంక్ ఆఫ్ కెనడా డిప్యూటీ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 2004లో గవర్నర్ బాధ్యతల నుంచి వైదొలగి ఆర్థిక మంత్రి పదవిని చేపట్టారు. అనంతరం 2008 ఫిబ్రవరి 1న సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా నియమితులయ్యారు. 2008-09 ఆర్థిక సంక్షోభం వేళ పరిష్కార మార్గాల్లో కీలక పాత్ర పోషించారు. ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయని, కేబినెట్‌లో పనిచేసిన అనుభవం లేని కార్నీ, కెనడా తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

**కెనడా ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదు**

ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న కార్నీ... ఓ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కెనడాను తమ దేశంలో 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామని వివిధ సందర్భాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై స్పందించారు. ఒట్టావా ఏవిధంగానూ.. ఏరూపంలోనూ అమెరికాలో భాగం కాదని ఆయన వ్యాఖ్యానించారు. తమ దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉందన్నారు. వాణిజ్యం అయినా, క్రీడలు అయినా చివరికి విజయం సాధించేది కెనడాయేనని అని పేర్కొన్నారు. "కెనడాను తమలో కలుపుకొని.. దేశంలో ఉన్న వనరులు, నీరు, భూమి వంటి వాటిని తమ స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అగ్రరాజ్యం ఉంది. ఈ విషయంలో వారు విజయం సాధిస్తే, మన జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. కాబట్టి ట్రంప్‌ను ఎప్పటికీ ఈ విషయంలో విజయం సాధించనివ్వను. వాషింగ్టన్ ఒట్టావాతో స్వేచ్ఛ, న్యాయమైన వాణిజ్యంపై విశ్వసనీయమైన నిబద్ధత చూపించేవరకు అమెరికాపై ప్రతీకార చర్యలు కొనసాగుతాయి" అని కార్నీ అన్నారు.

**భారత్‌తో సత్సంబంధాలు**

భారత్-కెనడా సంబంధాలపై కార్నీ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆవిధంగా కృషి చేయడానికి ఎదురు చూస్తున్నానని పేర్కొన్నారు. న్యూదిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# జర్మనీలో స్తంభించిన విమానయానం

- ఉద్యోగ, కార్మిక సంఘాల సమ్మె ప్రభావం
- 3400 విమానాలు రద్దు

బెర్లిన్: పశ్చిమ జర్మనీలో విమాన యానం స్తంభించింది. విమానాశ్రయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపునివ్వడంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిక్ సహా ప్రధాన నగరాల్లోని విమానాశ్రయాల్లో విమాన రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తంగా 5 లక్షల మంది ప్రయాణికులపై ప్రభావం పడినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయం నుంచి 1116 విమానాలు రాకపోకలు సాగిస్తుండగా ఇందులో 1054 సర్వీసులు రద్దయినట్లు స్థానిక మీడియా తెలిపింది. బెర్లిన్ నుంచి నడిచే విమానాలన్నీ రద్దయ్యాయి. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి. విమాన సర్వీసులు రద్దయినట్లు కొలోన్ విమానాశ్రయ అధికారులు ప్రకటించగా... సమ్మె కారణంగా విమాన సర్వీసుల సంఖ్య భారీగా తగ్గినట్లు మ్యూనిక్ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు తెలిపారు. మొత్తంగా 3400 విమాన సర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనా వేసింది. దాదాపు 5లక్షల మంది ప్రయాణికులపై ఇది ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా.. పని ప్రదేశంలో షరతులు సహా అదనపు సమయానికి ఎక్కువ మొత్తంలో బోనస్ ఇవ్వాలని కోరుతూ విమానాశ్రయాల్లో పనిచేసే సిబ్బంది, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, వారి డిమాండ్లను పరిష్కరించలేమంటూ ఆయా యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ, కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి.

# ఎంత సాయంచేసినా జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదు: ట్రంప్

వాషింగ్టన్: అమెరికానుంచి ఉక్రెయిన్‌కు వందల బిలియన్ల డాలర్లు అందించినా కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మండిపడ్డారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా బైడెన్ సర్కారు నుంచి సొమ్ములు తీసుకొన్నారన్నారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిని తానేనని... దాని పైప్‌లైన్ ఆపి ఆంక్షలు విధించానని తెలిపారు. రష్యా విషయంలో తనను మించి కఠినంగా ఎవరూ లేరని ట్రంప్ చెప్పుకొచ్చారు. మరోవైపు ఉక్రెయిన్ వీలైనంత తొందరగా యుద్ధం ముగించాలన్న ఒత్తిళ్లు డోజ్ సారథి మస్క్ వైపు నుంచి కూడా పెరిగాయి. తాజాగా తాను స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తే కీవ్ సేనలు కుప్పకూలుతాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఓటమి అనివార్యమని వ్యాఖ్యానించారు. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికాలోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయిన సంగతి విదితమే. ఆ తర్వాత అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు సైనిక, ఇంటెలిజెన్స్ పరంగా సాయం నిలిచిపోయింది.

# వైసీపీ వలస నేతలకు ఝలక్!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ వలస నేతలకు షాక్ తగిలింది. పదవులు ఆశించి పార్టీ ఫిరాయించిన నేతలకు ఎమ్మెల్సీ కోటా ఎన్నికల్లో బెర్త్‌లు లభించకపోవడంతో డీలా పడ్డారు. తమకు ఎలాగైనా ఎమ్మెల్సీ పదవులు వరిస్తాయన్న ధీమాతో కూటమి పార్టీల్లోకి కొందరు వైసీపీ నేతలు జంప్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసీపీ కీలక నేతలు ఒక్కసారిగా వలసబాట పట్టారు. వైసీపీలో ఆవిర్భావం నుంచి ఉన్న వారంతా తమ టీడీపీ, జనసేన గూటికి చేరారు. వారిలో మాజీ మంత్రులు మోపిదేవి వెంకట రమణ, బాలినేని శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఉన్నారు. వారితో పాటు చాలా మంది మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, ఎమ్మెల్సీ పదవులు వస్తాయనే ఆశతో టీడీపీ, జనసేన గూటికి చేరారు. మోపిదేవి వెంకట రమణ ఏకంగా తన రాజ్యసభ పదవికే రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ స్థానాన్ని మోపిదేవి పొందారు. తన పదవీ కాలం ముగియకముందే ఆయన రాజీనామా చేసి పార్టీ వీడారు. అదే సమయంలో తనకు రాజ్యసభ పదవిపై ఆసక్తి లేకపోయినా నాడు వైఎస్ జగన్ ఇచ్చారని ఆ సందర్భంలో ఆయన వ్యాఖ్యానించారు. తనకు ఎమ్మెల్సీ పదవిపై ఆసక్తి ఉందని, టీడీపీ ఇస్తుందన్న నమ్మకంతో చేరారని తెలిపారు. ఒంగోలుకు చెందిన మరో వైసీపీ కీలక నేత బాలినేని శ్రీనివాసులురెడ్డి జనసేనలో చేరారు. జనసేనలో చేరికతో ఆయనకు ఎమ్మెల్సీ, ఆ తర్వాత మంత్రి పదవి ఇస్తారన్న ఆఫర్‌తో ఆయన పార్టీ ఫిరాయించినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండో విడత మంత్రివర్గ విస్తరణలో బాలినేనికి చోటు దక్కలేదు. అప్పటి నుంచి ఆయన అసమ్మతితో ఉంటున్నారు. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఒంగోలు ఎంపీ విషయంలోనూ ఆయన చెప్పిన వారికి ఇవ్వకపోవడం, ఒంగోలు సమన్వయకర్తంగా చెవిరెడ్డిని నియమించడం తదితర సంఘటనలతో ఆయన అలక చెందారు. ఒంగోలు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచి పోటీ చేసి... కూటమి గాలిలో పరాజయం పొందారు. ఆ తర్వాత తాడేపల్లి కేంద్రంగా మాజీ సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సమీక్షలకు ఆయన హాజరు కాలేదు. అటుతర్వాత ఆయన జనసేనలోకి వెళ్లారు. ఆయనకు ఎమ్మెల్సీ కోసం కైకలూరు నియోజకవర్గానికి చెందిన జయమంగళ వెంకట రమణతో రాజీనామా చేయించారు. ఆ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని బాలినేనికి ఇచ్చేలా కూటమి నేతలు ప్రతిపాదనలు పెట్టారు. ఊహించని రీతిలో జనసేన నుంచి నాగబాబు పేరును ప్రతిపాదించడం, జయమంగళ రాజీనామా వేయడం చకచకా జరిగిపోయాయి. ఇక వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయిన జంగా కృష్ణమూర్తికి పార్టీ పదవులకు రాజీనామా చేసి టీడీపీలోకి ఫిరాయించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ ఆయన ఎమ్మెల్సీగా కొనసాగుతూ, మళ్లీ ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. వైసీపీ అధిష్ఠానం అందుకు నిరాకరించడంతో టీడీపీలోకి చేరారు. తన ఎమ్మెల్సీ పదవిని కొనసాగిస్తారన్న ఆశతో జంగా కృష్ణమూర్తి ఉన్నప్పటికీ టీడీపీ ఆయనకు షాక్ ఇచ్చింది. సొంత పార్టీ నేతలకే పదవులను కేటాయించింది. ఈ చర్యలతో వైసీపీ వలస నేతలకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి.

**భవిష్యత్‌లో ఎమ్మెల్యే టికెట్లపైనా ఆందోళన**

కూటమిలోకి వలస వెళ్లిన వైసీపీ నేతలకు భవిష్యత్‌లో ఎమ్మెల్యే టికెట్ల పైనా బెంగపెట్టుకుంది. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య తదితరులు జనసేనలో చేరారు. మరికొందరు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వైసీపీకి రాజీనామా చేసి మౌనంగా ఉండిపోయారు. కూటమి పార్టీలో చేరితే భవిష్యత్‌లో వారికి ఆయా సొంత నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నుంచి ఎమ్మెల్యే టికెట్లు వస్తాయా? లేదా? అనే దానిపై స్పష్టత లేదు. అక్కడ కూటమి సిట్టింగ్ ఎమ్మెల్యేలను కాదని... వైసీపీ నుంచి వలసలు వచ్చిన వారికి ఎలా ప్రాధాన్యత ఇస్తారనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారానే వలస నేతలకు చోటు లేదన్న విషయాన్ని వెల్లడించాయి. టీడీపీ తన పార్టీ కేడర్‌కే ప్రాధాన్యత కల్పిస్తోంది. జనసేన సొంత వారికే సీట్లు కేటాయిస్తోంది. 2027 వరకు ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. అప్పటి వరకు వైసీపీ వలస నేతలు పడిగాపులు పడాల్సిందే. అంతకంటే ముందు టీడీపీ నుంచి అనేక మంది సీనియర్లు ఎమ్మెల్సీల కోసం వేచిస్తున్నారు. గత ఎన్నికల్లో చాలా మంది సీట్లను త్యాగం చేశారు. వారికి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే వలసదారుల వైపు అధిష్ఠానం చూసే పరిస్థితి ఉంది. ఈ క్రమంలో వైసీపీ నుంచి వలసలు వెళ్లిన, వెళ్లబోయే నేతలకు ఎమ్మెల్సీ పదవులతో పాటు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్లపై స్పష్టత రాకపోవడంతో గందరగోళంలో ఉన్నారు.

# రాష్ట్ర అప్పుల పరిధిలోకి రావు

**అమరావతి నిర్మాణ రుణాలపై కేంద్ర ఆర్థిక శాఖ**

న్యూదిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని, అందుకను గుణం గానే రాజధానికి రుణాలు సమకూర్చే వ్యవహారంలో సహాయ సహకారాలు అందిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం తెలిపింది. అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) నుంచి తీసుకునే రుణాలు ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిధిలోకి రావని స్పష్టం చేసింది. ఈ రుణాలను ఏపీ అప్పుల కింద లెక్కించకూడదని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ మేరకు లోక్‌సభలో వైసీపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన అమరావతి నిర్మాణానికి విదేశీ సంస్థల నుంచి తీసుకునే రుణాలు ఆ రాష్ట్ర అప్పుల పరిధిలోకి రావు. రాజధాని ప్రాంతంలో అత్యవసర మౌలిక వసతుల కోసం ఇప్పటివరకు ప్రత్యేక సాయం, గ్రాంట్ల కింద ఏపీకి రూ.2,500 కోట్లు ఇచ్చామని మంత్రి చెప్పారు.

# ఐపీఎల్‌లో పొగాకు యాడ్‌లపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్య మంత్రిత్వ శాఖ సోమవారం లేఖ రాసింది. సరోగసీ యాడ్స్‌ను కూడా ప్రసారం చేయొద్దని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్‌కు రాసిన లేఖలో ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ అతుల్ గోయల్ స్పష్టం చేశారు. బీసీసీఐ నిర్వహించే టోర్నమెంట్లు, బోర్డుకు సంబంధించిన స్పోర్ట్స్ ఫెసిలిటీ సెంటర్లలో టొబాకో, ఆల్కహాల్, సరోగసీకి సంబంధించిన యాడ్‌లు ప్రదర్శించొద్దని పేర్కొంది. ఐపీఎల్‌లో పాల్గొనే ఆటగాళ్లతో పాటు కామెంటేటర్లు కూడా అలాంటి ఉత్పత్తులను ప్రచారం చేయకుండా అడ్డుకోవాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది. క్రికెటర్లు యువతకు ఆదర్శమని తెలిపింది. దేశంలో అతిపెద్ద క్రీడా సంబరమైన ఐపీఎల్‌పై సామాజిక బాధ్యత ఉందని స్పష్టంచేసింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పొగాకు, మద్యం ఉత్పత్తుల యాడ్స్ మీద నిషేధం విధించాలని తెలిపింది.

# గురుప్రీత్ కుటుంబానికి రూ.25 లక్షల సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీలో చిక్కుకుని మృతిచెందిన ఇంజినీర్ గురుప్రీత్ సింగ్ కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.25 లక్షలు సాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉన్నతాధికారులు, డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్... నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ మైనర్స్, దక్షిణ మధ్య రైల్వే, కేరళకు చెందిన కడావర్ డాగ్స్ స్క్వాడ్, వివిధ విభాగాల అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సహాయక బృందాలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో సహాయక చర్యలను మరింత వేగంగా, సమర్థవంతంగా కొనసాగించాలని సూచించారు. గురుప్రీత్ సింగ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , గురుప్రీత్ సింగ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రూ.25 లక్షలు నష్టపరిహారం ప్రకటించారని తెలిపారు. సహాయక బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు.

# 'ఏ2'కు మరణ దండన

(మొదటిపేజీ తరువాయి)

వెలువరించింది. ఈ కేసులో నిందితుడు సుభాష్ శర్మ (ఏ2)కు కోర్టు మరణ దండన విధించింది. మిగిలిన నిందితులకు జీవిత ఖైదు ఖరారు చేసింది. తన కుమార్తెను కులాంతర వివాహం చేసుకున్నాడనే నెపంతో మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారుతీరావు...2018 సెప్టెంబర్ 14న కిరాయి ముఠాతో యువకుడు ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు విచారణ పూర్తి చేసి, 8 మందిని నిందితులుగా పేర్కొంటూ న్యాయస్థానంలో 2019లో చార్జిషీట్ దాఖలు చేశారు. 6 ఏళ్లకు పైగా కోర్టులో విచారణ సాగగా... ఇటీవలే వాదనలు ముగిశాయి. తాజాగా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ప్రణయ్ హత్య కేసులో ఏ1గా ఉన్న నిందితుడు మారుతీరావు 2020లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ కేసులో ఏ2 సుభాష్ కుమార్ శర్మ, ఏ3 అస్గర్‌అలీ, ఏ4 బారీ, ఏ5 కరీం, ఏ6 శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాంలు మిగిలిన నిందితులుగా ఉన్నారు. వీరిలో సుభాష్ శర్మకు బెయిల్ రాకపోవడంతో జైల్లోనే ఉండగా, అస్గర్ అలీ వేరే కేసులో జైలులో ఉన్నాడు. మిగిలిన వారంతా బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా అనారోగ్య సమస్యలు ఉన్నాయని, తమపై ఆధార పడిన తల్లిదండ్రులు, పిల్లల కోసం శిక్ష తగ్గించాలని నిందితులు న్యాయస్థానాన్ని వేడుకున్నారు. తనకు ఈ కేసుతో సంబంధం లేదని అమృత బాబాయ్ శ్రవణ్ కుమార్ అన్నారు. ముగ్గురు పెళ్లికాని పిల్లలు ఉన్నందున క్షమించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

**ఈ తీర్పు నేరస్థులకు గుణపాఠం కావాలి**

నల్గొండ కోర్టు తీర్పుపై హత్యకు గురైన ప్రణయ్ తండ్రి పెరుమాల బాలస్వామి స్పందిస్తూ... తన కుమారుని పరువు హత్యపై కోర్టు ఇచ్చిన తీర్పుతోనైనా ఇటువంటి నేరగాళ్లకు కనువిప్పు కలగాలన్నారు. న్యాయం కోసం 'జస్టిస్ ఫర్ ప్రణయ్' అంటూ పోరాటం చేశామని తెలిపారు. ఈ హత్య తర్వాత కూడా చాలా పరువు హత్యలు జరిగాయని వారందరికీ ఈ తీర్పు గుణపాఠం కలగాలని బాలస్వామి అన్నారు. 'మేము ప్రణయ్ హత్య ద్వారా చాలా కోల్పోయాం. అమృతకు భర్త లేడు. నాకు కొడుకు లేడు. నా మనవడికి నాన్న లేడు' అని ప్రణయ్ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. సుభాష్ శర్మకు ఉరిశిక్ష...మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష పడిందని ఈ క్రమంలో వారి కుటుంబాలు కూడా బాధపడుతుంటాయని, తనకు ఎవరిపై కోపం లేదన్నారు. వారు కూడా ఈ రకమైన హత్యలకు పాల్పడడం విచారకరమని ప్రణయ్ తండ్రి అన్నారు. ఇలాంటి విషయాల్లో ఏదైనా ఉంటే చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ తీర్పుతో పరువు హత్యలు ఆగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మిరియాలగూడకు చెందిన మారుతీరావు కుమార్తె అమృతను ప్రణయ్ అనే యువకుడు 2018 జనవరిలో హైదరాబాద్‌లో ప్రేమపెళ్లి చేసుకున్నాడు. వీరి వివాహంతో రెండు కుటుంబాల మధ్య విబేధాలు వచ్చాయి. దీంతో రెండు కుటుంబాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే తాను ప్రణయ్‌తోనే ఉంటానని పోలీసుల సమక్షంలో అమృత తేల్చిచెప్పింది. 2018 సెప్టెంబరు 14న వైద్య పరీక్షల కోసం భర్త ప్రణయ్, అత్త ప్రేమలతతో కలిసి అమృత ఆస్పత్రికి వెళ్లింది. వైద్య పరీక్షలు ముగించుకుని తిరిగి వెళ్తుండగా ప్రణయ్‌ను దుండగులు కత్తితో నరికారు.

# పాలకులు మోసం చేశారు

- మహాధర్నాలో అంగన్‌వాడీల ఆగ్రహం
- ఏపీ నలుమూలల నుంచి తరలివచ్చిన వర్కర్లు... హెల్పర్లు
- ఉద్యమం అణిచివేతకు ప్రభుత్వం కుట్ర
- హామీలు అమలయ్యే వరకు ఉద్యమం
- అంగన్‌వాడీ సంఘాల నాయకుల హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ: ప్రభుత్వాలు హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో నిర్వహించిన 43 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో నిర్వహించిన చర్చల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) సంఘాల సంయుక్త అధ్వర్యాన సోమవారం విజయవాడలో మహాధర్నా నిర్వహించారు. రాష్ట్ర నలుమూల నుంచి వేలాదిగా తరలివచ్చిన అంగన్‌వాడీలతో ధర్నాచౌక్ కిక్కిరిసిపోయింది. మరోవైపు పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. లెనిన్ సెంటర్ వైపు రాకుండా బారికేడ్‌లు అడ్డుపెట్టారు. ఈ సందర్భంగా తమ ఉద్యమాన్ని అణిచివేసేందుకు కుట్ర పన్నిందని విమర్శిస్తూ, హామీలు అమలుపరిచే వరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నిందని అన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటో చెప్పాలన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం కార్మికుల విషయంలో అనుసరిస్తున్న విధానాల్లో ఏ మాత్రం తేడా లేదని విమర్శించారు. కార్మికుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నాయని చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇస్తామని ఒప్పుకున్నారని, జీవోలో మాత్రం రూ.15 వేలు మాత్రమే పేర్కొన్నారని అన్నారు. దీనిపై కార్మికులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వ విధానాలు మార్చవచ్చని అన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్ మాట్లాడుతూ నమ్మించి ఓట్లేయించుకున్న తరువాత ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు వ్యవహరించడం కూటమి పాలకులకే చెల్లిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రాకముందు చెప్పిన మాటకు, ముఖ్యమంత్రి అయ్యాక చెబుతున్న మాటకు పొంతన లేదని విమర్శించారు. రాష్ట్రంలో అతి తక్కువ గౌరవవేతనంతో అంగన్‌వాడీలు పని చేస్తున్నారని, అయినా ప్రభుత్వాలకు కనికరం లేదన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 2024 జులై నుంచే మలు చేస్తామని చెప్పారని, పెంచిన వేతనాలు అగస్టు నుంచి అన్నారని, అయితే ఇంతవరకు అతీగతి లేదని విమర్శించారు. వేతనాలు విషయం తేల్చేవరకూ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఏపీ ప్రగతిశీల ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కనీస స్పందన లేదన్నారు. యూనియన్ పూర్వ కార్యదర్శి రోజా, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శులు ధనలక్ష్మి, పిఒడబ్ల్యు నాయకులు పద్మ తదితరులు మాట్లాడారు. ధర్నాకు బేబీరాణి, ప్రేమ, భారతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు పొలారి, వెంకటసుబ్బయ్య, రమణ, మోహన్, వెంకట్ పాల్గొన్నారు.

**మండలిలో వాయిదా తీర్మానం ఇస్తాం: ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు**

అంగన్‌వాడీల సమ్మెకు పీడీఎఫ్ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, వారి సమస్యల పరిష్కారం కోసం మండలిలో చర్చకు వాయిదా తీర్మానం ఇస్తామని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తెలిపారు. గ్రాట్యుటీ, వేతనాలు పెంచుతామని, మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# యూపీలో గోదుమకు మద్దతు ధర పెంపు

లక్నో: గోదుమల సేకరణకు సంబంధించిన కొత్త విధానాన్ని ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం ఆమోదించింది. సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో కొత్త గోదుమ సేకరణ విధానాన్ని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆమోదించారు. దీంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గోదుమ మద్దతు ధరను గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.150 పెంచారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గోదుమ మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. కేబినెట్ సమావేశం ముందు ఈసారి మొత్తం 19 ప్రతిపాదనలు ఉంచినట్లు రాష్ట్ర ఆర్థిక, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి సురేశ్ కుమార్ ఖన్నా తెలిపారు. ఆ ప్రతిపాదనలన్నింటికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గోదుమ కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2425గా నిర్ణయించామని, గతంలో గోదుమ మద్దతు ధర రూ.2275 ఉండేదని పేర్కొన్నారు. మార్చి 17 నుండి గోదుమల కొనుగోలు ప్రారంభించాలని అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. స్టాంపుల విభాగంపై సురేశ్ ఖన్నా మాట్లాడుతూ రూ.10 వేల నుండి రూ.25 వేల విలువైన భౌతిక స్టాంపులను చెలామణి నుండి ఉపసంహరించుకునేలా ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. రూ. 5630.87 కోట్ల విలువైన ఈ- స్టాంపులను వివిధ ట్రెజరీలలో ఉంచారు. టెక్స్‌ఫెడ్ గ్రూప్ కింద, కాన్పూర్‌లోని యూపీ కోఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ లిమిటెడ్ మూసివేసిన స్పిన్నింగ్ మిల్లుల భూమిని పారిశ్రామిక ఉపయోగం కోసం యూపీసీడీఏకు ఉచితంగా బదిలీ చేశారు. నగరం మధ్యలో ఉన్న ఈ స్పిన్నింగ్ మిల్లును బదిలీ చేసిన తర్వాత... కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

# 'ఎక్స్' సేవలకు అంతరాయం

(మొదటిపేజీ తరువాయి)

వినియోగదారులుఇతర సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేశారు. డౌన్‌డిటెక్టర్ పోర్టల్ ప్రకారం భారత్‌లో వేలాది ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. అమెరికాలో 18 వేల మంది, బ్రిటన్‌లో 10 వేల మంది 'ఎక్స్' సేవలు రావట్లేదని పోస్టులు చేసినట్లు సమాచారం. అమెరికాలో దాదాపు 57 శాతం మందికి ఈ సమస్య ఎదురైనట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. సిబ్బంది కొరత, ఇతర సాంకేతిక కారణాల వల్ల తరచూ ఆ మధ్య 'ఎక్స్' సేవలు తరచూ నిలిచిపోయిన సంగతి తెలిసిందే.

# అసెంబ్లీకి కేసీఆర్ వస్తారు

(మొదటిపేజీ తరువాయి)

దిగే విమానం తప్ప చేసేది ఏమీ లేదు అంటూ ఎద్దేవా చేశారు. ఈ- కార్ రేసు కేసులో మళ్లీ నోటీసులు ఇస్తారని, 16న బడ్జెట్ పెట్టి, 17 నోటీసులు ఇచ్చి మళ్లీ పిలుస్తారని అన్నారు. ప్రతి బడ్జెట్‌లో ఇది ఉండేదే, ఇది ముమ్మాటికీ లొట్టపీసు కేసు అంటూ మరోసారి పునరుద్ఘాటించారు. ఇప్పుడు రూ.200 కోట్లతో ప్రపంచ సుందరి పోటీలు పెడుతున్నారని, దీనివల్ల లాభం ఏంటి, ఒలింపిక్స్ పెడుతానంటున్నాడు దానికి లక్ష కోట్లు కావాలని అన్నారు.

# ధర్నాకు సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

బాధపడుతారని కిషన్‌రెడ్డి రాలేదా అని ఎద్దేవా చేశారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సమీక్ష పెడితే ఎందుకు రాలేదు... ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన ప్రాజెక్టులు తెలంగాణకు ఎందుకు ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ అభివృద్ధిని ఇతర ప్రాంతాలకు విస్తరించాలని మేం భావిస్తున్నాం. రాష్ట్రానికి నిధులు రాకూడదని బీఆర్ఎస్ చూస్తోంది. రాష్ట్రాభివృద్ధి, కేంద్ర నిధులపై చర్చకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సిద్ధం కావాలి. చర్చకు నేను, భట్టి విక్రమార్క రావడానికి సిద్ధంగా ఉన్నాం. అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తాం. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించేందుకు సీఎం స్థాయి సరిపోదా... పీసీసీ అధ్యక్షుడిగా... కేసీఆర్‌ను గద్దెదింపి అధికారంలోకి వచ్చాం. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే.. ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదన్నారు. మందకృష్ణ మాదిగ అంటే నాకు గౌరవం. పోటీ పరీక్షల ఫలితాలకు... రిజర్వేషన్లకు ఎలాంటి సంబంధం లేదు. మందకృష్ణ బీజేపీ నేతలా మాట్లాడితే ఎలా అని అన్నారు. గతంలో ఎప్పుడో వచ్చిన నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అంశం వర్తించదు. ఏదైనా చేయాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయి. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారో నాకు తెలియదు. కేటీఆర్, కిషన్‌రెడ్డి కలిసి తిరుగుతున్నారని నేను చెబుతున్నా' అని సీఎం పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: పాలకుర్తి మండలం రామారావు పల్లిలో సోమవారం నూతన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ భూమి పూజ చేసి స్థానిక నాయకులతో కలిసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రామగుండం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని అన్నారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గానికి 14 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉందని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా పాలనలో భాగంగా అర్హులైన పేదలకు ఇండ్లను, వివిధ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మంజూరి కోసం కానీ, బిల్లుల కోసం కానీ దళారులను ఆశ్రయించి మోస పోవద్దని అన్నారు. లబ్ధిదారుల పట్ల పూర్తి పారదర్శకంగా,అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం,అధికారులు వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీవో తదితర అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరోమహబూబాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మాచారి, లతో కలసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల వారితో సమన్వయ పరుస్తూ దరఖాస్తుదారులకు దిశా, నిర్దేశము చేసి పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలోవ్యవసాయ శాఖ 3, డిపిఓ 3, డిఆర్‌డిఓ 4, ఎస్టీ వెల్ఫేర్ 3, ఎంపీడీవో బయ్యారం 5, దోర్నకల్ 3, మహబూబాబాద్ 3, తహసిల్దార్ కేసముద్రం 4, మహబూబాబాద్ 3, తదితర విభాగాలకు చెందిన (84) మొత్తం దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహ స్వామి, డిసిఓ వెంకటేశ్వర్లు, సిపిఓ సుబ్బారావు, డిఈఓ ఏ. రవిందర్ రెడ్డి, ఎడి సర్వే ల్యాండ్ నరసింహమూర్తి, డిడి సురేష్ గ్రౌండ్ వాటర్, డి పి ఓ హరి ప్రసాద్, డి ఎం కృష్ణవేణి, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, డిడి ట్రైబల్ వెల్ఫేర్ దేశి రామ్ నాయక్, జిఎం ఇండస్ట్రీస్ సత్యనారాయణ, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర ప్రతినిధి-ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా అఖిల్ మహాజన్ సోమవారం భాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వద్ద నుంచి జిల్లా ఎస్పీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున సరిహద్దుపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టడి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డిఎస్పీ లు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్ రెడ్డి, నాగేందర్, హసీబుల్లా, రిజర్వు ఇన్స్పెక్టర్లు తదితరులు జిల్లా ఎస్పీకి ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించారు.

## రుణమాఫీ అమలు చేయాలి : రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: రైతు భరోసా, రెండు లక్షల రూపాయల రుణమాఫీని పూర్తిస్థాయిలో రైతాంగానికి వర్తింపచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మరిపెడ మండలం నీలికుర్తి గ్రామంలో మూడో మహాసభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావులతో కలిసి వారు మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా, కనీస మద్దతు ధర ఒక కలగానే మారిపోయిని, రైతాంగం ఆత్మహత్య శరణ్యంగా మార్చి, రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేసి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. నల్ల చట్టాలను అమలు చేయాలనే కుట్ర పూరిత విధానాలపై రైతాంగం సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. అనంతరం రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా అనపర్తి సత్యం, పోలేబోయిన జనార్ధన్ లు ఐదుగురితో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు మారగాని బాలకృష్ణ, ఎండి అబ్దుల్ రషీద్, గాడిపెల్లి వెంకన్న, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

విశాలాంధ్ర-నేరేడుచర్ల : అణగారిన వర్గాల విద్య కై జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి కార్యక్రమాన్ని నేరేడుచర్ల లో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ ఆడపిల్లల చదువులకై నిరంతరం పాటుపడిన మహిళ చైతన్య మూర్తి అన్నారు. సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు చిలకరాజు శ్రీను, హుజూర్ నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రాపోలు నవీన్ కొమర్రాజు వెంకట్ పాల్గొన్నారు.

## దరఖాస్తులు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: జిల్లాలోని ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం చిన్న బొంకూర్ గ్రామానికి చెందిన బి.సతీష్ ఎంపీడీవో కార్యాలయం నందు ఒక రూము కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్సూచించారు. పెద్దపల్లి పట్టణం టీచర్స్ కాలనీకి చెందిన బొంకూరి ప్రవీణ్ తమ కాలనీలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుందని, మురుగునీరు రాకుండా చేసి ఈగల నుండి దోమల నుండి దుర్గంధం నుండి విముక్తి కలిగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల పేదల అభ్యున్నతి : ఎమ్మెల్యే పాయం

విశాలాంధ్ర - పినపాక : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి జరుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రారంభోత్సవంలో భాగంగా సోమవారం పినపాక మండలంలోని భూపాలపట్నం గ్రామంలో శంకుస్థాపనలు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి కనీస వసతి కల్పించే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం పేర వేల కోట్లు కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చి పేదలను విస్మరించిందని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలందరూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరితో సంతోషంగా ఉన్నారని తెలిపారు. తాము ఇళ్ళు అవసరమున్న పేదలకు సొంత ఇంటి స్థలాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తుందన్నట్లు చెప్పారు. దశలవారీగా ఇల్లు లేని వారందరికి ఇందిరమ్మ గృహాలు అందిస్తామన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగాచేసి బీఆర్ఎస్ ప్రభుత్వం లూటీ చేసిందన్నారు. కార్యక్రమంలో పినపాక తహసీల్దార్ అద్దంకి నరేష్,

ఎంపిడిఓ సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గొడిశాల రామనాథం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి

విశాలాంధ్ర -ఖమ్మం : భారతదేశంలో మహిళా చైతన్యానికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే భారతదేశ సమాజ చైతన్యా నికి ప్రతీక అని బిసి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు తెలిపారు. సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా స్థానిక -ఆర్అండ్బి గెస్ట్ హౌజ్ సమీపంలోని ఆమె విగ్రహానికి బిసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతీయ సమాజంలో స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహానుభావురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. సామాజిక చైతన్యం కోసం ఆమె విశేష కృషి చేశారని ఆయన తెలిపారు. మహిళా చైతన్యంతోనే సామాజిక చైతన్యం సాధ్యమవుతుందని నమ్మిన జ్యోతిరావు పూలే బాలిక విద్య కోసం అనేక పాఠశాలలు ప్రారంభించారని ఆయన తెలిపారు. నివాళులర్పించిన -వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ

సభ్యులు పగడాల మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ. సిపిఐ నాయకులు తాటి నిర్మల, -నూనె శశిధర్, మద్దోజు శ్రావణ్, జ్వాలా నర్సింహారావు, మేకల రవికుమార్, నంబూరి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం : ఎమ్మెల్యే కోరం

విశాలాంధ్ర - గార్ల : పేదలందరికి వివిధ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికి పథకాలు కొంత జాప్యమౌవుతుందన్నారు. అర్హులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. సంక్షేమ పథకాలు డబ్బులను వృధా చేయకుండా అవసరాలకు మాత్రమే వినియోగించు కోవాలని కోరారు. కాంగ్రెస్ పేదల, అన్నివర్గాల బాధితుల ప్రభుత్వమన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారులు గ్రామాలలో మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు,

మాలోత్ సురేష్, ఎంపీడీవో మంగమ్మ, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినీలకు ఎస్‌బీఐ సైకిళ్ల వితరణ

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : విద్యార్థినీలు బాగా చదివి ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన సైకిళ్ల వితరణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన తర్వాత జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. ఆర్‌పి రోడ్ బాలికల ఉన్నత పాఠశాల, బోయవాడ రామగిరి గర్ల్స్ స్కూల్, మల్లెబోల్లి పాఠశాలలోని 30 మంది విద్యార్థినీలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న నకిరేకల్‌కు చెందిన సరితకు పేపర్ ప్లేట్ల యూనిట్ ఏర్పాటుకు లక్ష 90 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పీఎంఈజీపీ కింద అందించారు. ఐటిపాముల బ్యాంకు ద్వారా వెంకన్న, మణెమ్మ అనే ఇద్దరు రైతులకు రూ.50 లక్షల విలువ చేసే రెండు హార్వెస్టర్ లను అందజేశారు .ఐటిపాముల బ్యాంకు ద్వారా 8 స్వయం సహాయకు మహిళా సంఘాలకు బ్యాంకి లింకేజీ కింద కోటి 50 లక్షల రూపాయల విలువైన చెక్కులను, బి సి బాలికల ,మైనార్టీ హాస్టల్ విద్యార్థినిలకు 20 శానిటరీ నాప్కిన్ ఇన్సినేటర్లను అందజేశారు. అడవిదేవులపల్లి , షేర్ బౌలి అంగన్వాడి కేంద్రాలను, అలాగే మహాలక్ష్మి వృద్ధాశ్రమాల ఆధునికీకరణ, మిర్యాలగూడ,ఐటిపాముల ఎస్టి గర్ల్స్ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సి ఎస్ ఆర్ నిధుల ద్వారా చేపట్టేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం వినోద్ కుమార్ సిన్హా, రీజినల్ మేనేజర్ అలీముద్దీన్, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, జిల్లా ఎల్డీఎం శ్రామిక్, ఏపీ డి శారద ,ఎంఈఓ అరుంధతి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఘనంగా పూలే వర్ధంతి

విశాలాంధ్ర -గూడూరు: భారతదేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన సావిత్రిబాయి పూలే వర్ధంతి గూడూరు మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బేతంచెర్ల, గూడూరు మండల కేంద్రంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బేతంచెర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న, సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పార్నంది రామయ్య మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కొరకు నిమ్న జాతి వర్గాల అభివృద్ధికి పాల్పడిన మొట్టమొదటి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలని అన్నారు. సావిత్రిబాయి పూలే మహిళల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేయడం కొరకు పోరాటం చేసి సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే దంపతులుచదువుకై అనేక బాటలు వేషాలను తెలిపారు. సావిత్రి భాయ్ పూలే మార్గంలో నేటి యువత ప్రజాభివృద్ధి కొరకైపాటుపడాలని, చెడు మార్గం నుంచి వీడిమంచి మార్గంలో పయనించాలని కోరారు. యువత ఉన్నత శిఖరాలనుఅధిరోహించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోకాళ్ళవెంకన్న,బేతంచెర్ల ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న,కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులు కత్తి స్వామి, ఐ ఈ ఆర్ పి వాల్య, మండల అధ్యక్షులు చుంచ బాలయ్య, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యాకుబ్ పాషా, వెంకన్న,రేగ సాంబయ్య, ఈసం మంజుల, కొట్టెం పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పూలే ఆశయాలను కొనసాగించాలి : కళావతమ్మ

విశాలాంధ్ర-వనపర్తి : సంఘ సంస్కర్త, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలని ఎన్ ఎఫ్ఐడబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ కళావతమ్మ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ పిలుపు నిచ్చారు. సోమవారం వనపర్తి పట్టణం శ్వేతానగర్ ఆఫీస్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఎఫ్ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘసంస్కర్త అయిన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో విద్యనభ్యసించి దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేశారన్నారు. మహిళలు, బాలికలకు విద్య అవసరం లేదన్న బ్రాహ్మణ వాదాన్ని బద్దలు కొడుతూ బాలికలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించి చదువు చెప్పారన్నారు. సంఘసంస్కర్తలు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే మనువాదాన్ని, బ్రాహ్మణవాదాన్ని తిరస్కరించగా, బిజెపి ప్రభుత్వం అదే మన ధర్మ సిద్ధాంతాన్ని భారత దేశంలో అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా బీజేపీ కుట్రను తిప్పికొట్టేందుకు ప్రజలు, అభ్యుదయ వాదులు, మహిళా లోకం ప్రతిన పూనాలన్నారు. ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ పట్టణ కోకన్వీనర్ శిరీష, శ్రీదేవి, జ్యోతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సిపిఐ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఇల్లందు : ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వైద్యానికి అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లను ప్రభుత్వం కేటాయించడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం గురుకులాల పేరుతో పక్కా భవనాలు నిర్మించకుండా కోట్ల రూపాయలతో అద్దె భవనాల్లో నిర్వహించిందన్నారు. దీనివల్ల ఇల్లెందుకు వచ్చిన బీసీ గురుకులం ఖమ్మం జిల్లా కారేపల్లి కి తరలిపోయిందన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ళ హయాంలో గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించక పోగా ఉన్న వాటికీ మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ వంటి సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సర్వే నిర్వహించి విద్యార్థుల సమస్యలు, ఇబ్బందులు గుర్తించి పక్కా ప్రణాళికతో భవనాలను నిర్మించడం జరుగుతుందన్నారు. ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలుగా మార్చి నూతన భవన నిర్మాణం కోసం రూ.37 కోట్లు, ఐటిఐ భవన నిర్మాణం కోసం రూ.11.50 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రైతుబంధు మినహా ఇతర ఎలాంటి పథకాలు ప్రజల దరి చేరలేదన్నారు. ఆ రైతు బంధు కూడా చిన్న రైతులకంటే బడా భూస్వాములకు చాలా ఉపయోగపడిందని ఎద్దేవ చేశారు. టేకులపల్లి, ముత్యాలంపాడు గ్రామాలలో 10 సబ్ స్టేషన్ల కొసం రూ.3 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లో 6 నుంచి డిగ్రీ వరకు 2500 విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నూతన ఐటిఐ కళాశాలలో పలు రకాల కోర్సులలో సుమారుగా 200 సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, నాయకులు దమ్మలపాటి వెంకటేశ్వరరావు, దొడ్డ డానియల్, పులి సైదులు, మండల రాము, మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జె. వెంకటేశ్వర్లు, పడిదల నవీన్ కుమార్, పింగళి నరేష్, జాఫర్,సుదర్శన్ కోరి, పెద్దినేని హరినాథ్ బాబు, ఉల్లింగ సతీష్, పత్తి స్వప్న, కల్తి పద్మ, నాగరత్నమ్మ, పాయం స్వాతి, ఎల్లయ్య, ఎట్టి హరికృష్ణ, గిన్నారపు రవి తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యం : వేణుమాధవ్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సెక్యూరిటీ సిబ్బందికీ క్రమశిక్షణ చాలా ముఖ్యమని సింగరేణి సంస్థ అందిస్తున్న శిక్షణ తరగతులు జీవితంలో అన్నివిధాలా ఉపయోగ పడతాయని సెక్యూరిటీ ఎస్ఓటు జీఎం జె. వేణుమాధవ్ అన్నారు. మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే వ్యక్తిగతంగా, వృత్తి పరంగా గుర్తింపు వస్తుందన్నారు. సోమవారం 49వ ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. నాలుగు రోజుల వరకు జరిగే ఈ తరగతులు సెక్యూరిటీ సిబ్బంది చాలా అవసరమన్నారు. ఈ నాలుగు రోజుల శిక్షణా కాలంలో ట్రాఫిక్ రెగ్యులేటరీ చట్టం, మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, ట్రాఫిక్ పాయింట్ మెన్ డ్యూటీస్, క్రౌడ్ కంట్రోల్ వంటి అంశాలపై అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలతో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ వల్ల ఎటువంటి రోడ్డు ప్రమాదాల నివారణ, మెయిన్ గేటు, చెక్ పోస్ట్ ల వద్ద రద్దీ కంట్రోల్ తో సాఫీగా సాగేందుకు దోహదం చేస్తుందన్నారు. అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుందని జీయం వివరించారు. వృత్తి నైపుణ్యం, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని సెక్యూరిటీ సిబ్బంది కోరారు. అనంతరం రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి వెంకటరమణ మాండేటరీ, కాషనరీ, ఇన్ఫర్మేటరీ సిగ్నల్స్, డ్రైవర్ హ్యాండ్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నియమాల గురించి బోధించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐతో విద్యాబోధన విద్యార్థులకు వరం : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) తో విద్యాబోధన విద్యార్థులకు వరంగా మారనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం బూర్గంపాడు మండలం అంజనాపురం ఎంపీపీ ఎస్ పాఠశాలల్లో ఏఐతో విద్యా బోధన తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన మరింత ఆకర్షణీయంగా, ఇంట్రాక్టివ్ గా నిర్వహించటానికి ఎఐ బాగా సహకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ.. అందుకు తగినట్లు అభ్యాస కృత్యాలు జనరేట్ చేయడంతో పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచేలా బోధన చేయవచ్చన్నారు. విద్యార్థులందరూ ప్రతిరోజు కంప్యూటర్ ల్యాబ్ ను వినియోగించాలని కోరారు. బూర్గంపాడు మండలంలో అంజనాపురం, మోరంపల్లి బంజారా, బూర్గంపాడు 2, నాగినేని ప్రోలు, గాంధీనగర్ పాఠశా లలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం కలెక్టర్ బూర్గంపాడు ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు చదివించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహారం అందిస్తున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో చదవటానికి వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం మోరంపల్లి బంజర్ లో నూతన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. వేపల గడ్డ బస్టాండ్ సమీపంలో సూచించిన నాలుగు ఎకరాల భూమిని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డిప్యూటీ తాసిల్దార్ నరేష్, ఎంఈఓ, అధికారులు పాల్గొన్నారు.

## అన్ని సదుపాయాలతో భవన నిర్మాణం : కలెక్టర్

విశాలాంధ్ర - ఇల్లందు : పట్టణంలో నిర్మించనున్న వంద పడకల ఆస్పత్రి, ఐటిఐ కళాశాల నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరిశీలించారు. రూ.38 కోట్లతో వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని సదుపాయాలతో నూతన భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ భవన నిర్మాణం రూ. 11 కోట్ల 50 లక్షలతో చేపడుతున్నట్లు చెప్పారు. ఇల్లందులో అనువైన స్థలాలను పరిశీలించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ, సింగరేణి స్థలాలను కలెక్టర్, ఎమ్మెల్యే సంయుక్తంగా పరిశీలించారు. ఈ స్థల పరిశీలనలొ విరితోపాటు సింగరేణి ఇల్లందు ఏరియా జిఎం వీసం కృష్ణయ్య, తహసీల్దార్ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఈవీఎంల రక్షణకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర,కొమరం భీం : జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఈ.వి.ఎం. గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి ఎన్నికల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ.వి.ఎం. యంత్రాలకు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టడం జరుగుతుందని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.

సంపాదకీయం

## దిగులు కలిగిస్తున్న విద్వేష రాజకీయాలు

ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లోని ఓ పోలీసు అధికారి హోళీ సందర్భంగా ఎవరైన రంగులు చల్లితే, పూస్తే సహించలేనివాళ్లు హోళీ రోజు ఇళ్ల నుంచి బయటకు రాకూడదని హితబోధ చేశారు. ఈ హితబోధను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి సమర్థించారు కూడా. మరో వేపు హిందూ అమ్మాయిలు మతం మారిస్తే వారికి మరణ శిక్ష విధిస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ అంటున్నారు. ఇంకో వేపు మహారాష్ట్రలోని మంత్రి నితేశ్ రాణే హిందువులు నడిపే మాంసం దుకాణాలకు 'ప్రత్యేక సర్టిఫికేట్ ఇస్తారట. ఉత్తరప్రదేశ్‌లో పోలీసు అధికారి రంగులాడడం ఇష్టం లేనివారు ఆ రోజు ఇళ్ల నుంచి బయటకు రాకూడదన్నా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మతం మార్చే హిందూ అమ్మాయిలకు మరణ శిక్ష విధిస్తామన్నా ఈ మూడు సందర్భాలలోనూ ముస్లింలను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఏడాదికి 52 సార్లు వస్తుంది. కానీ ఏడాదికి ఒక సారే వస్తుందని కూడా సదరు పోలీసు అధికారి పేర్కొన్నారు. శుక్రవారం హోళీ పండగ ఉంది. ఇది రంజాన్ నెలకూడా. నిష్ఠా గరిష్టులైన ముస్లింలు రోజుకు అయిదు సార్లు నమాజ్ చేస్తారు. ముస్లింలది సామూహిక ప్రార్థనా విధానం. హిందువులది సామూహిక ఆరాధనా పద్ధతి కాదు. అలాంటి సామూహిక ఆరాధనలు అప్పుడప్పుడూ జరుగుతూ ఉండొచ్చు. ముస్లింలు వీలైనంత వరకు మసీదుకు వెళ్లి నమాజు చేయడం ఆనవాయితీ. కుదరనప్పుడు ముస్లింలు ఒంటరిగానే నమాజు చేసుకోవడం కూడా సర్వ సాధారణమే. ఈ సారి హోళీ శుక్రవారం వచ్చింది. రోజూ నమాజు చేయడం కుదరని వారు కనీసం శుక్రవారం అయినా చేస్తారు. వీలైతే ఆ రోజు మసీదుకు వెళ్లి నమాజ్ చేస్తారు. హోళీ కూడా ఈ సారి శుక్రవారమే వచ్చింది కనక, ఇది రంజాన్ నెల కనక ముస్లింలు అధిక సంఖ్యలో మసీదులకు వెళ్లి నమాజు చేస్తారు. అందువల్ల రోడ్ల మీద రంగుల పండుగ జరుపుకునే వారు ముస్లింల మీద రంగులు పోస్తే సహించలేని వారు ఇళ్లల్లోనే ఉండి నమాజు చేసుకోవడం మేలని ఉత్తరప్రదేశ్ పోలీసు అధికారి సెలవిచ్చారు. ఆ పోలీసు అధికారి పహెల్వాన్ అని కూడా గమనించండి అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఆ పోలీసు అధికారిని సమర్థించారు. ఇందులో మేం హోళీ జరుపుకుంటాం కనక మీరు వీధుల్లోకి రాకండి అని హెచ్చరిస్తున్నారన్నమాట. సంభల్ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ అనుజ్ కుమార్ హోలీ రోజు అంటే వచ్చే శుక్రవారం రోజు ముస్లింలు ఇంటి నుంచి బయటకు రాకూడదు అంటున్నారంటే మసీదుకు వెళ్లి ముస్లింలు నమాజు చేయకూడదని చెప్తున్నారన్నమాట. అంటే అధిక సంఖ్యాకులైన హిందువుల పండగలప్పుడు నమాజు చేయడానికైనా ముస్లింలు ఇంటి నుంచి బయటకు రాకూడదనే. ఇది ముస్లింల పట్ల బీజేపీ నాయకులు చూపే వివక్షకు, విద్వేషానికి సంకేతం. సంభల్ పోలీసు అధికారికి కూడా ఈ వివక్ష, విద్వేషం బాగా ఒంటబట్టాయనే అనుకోవాలి. అధికారంలో ఉన్న బీజేపీ పక్షం నాయకులు విద్వేష పూరిత రాజకీయాలు నడపడం మామూలు అయి పోయింది. దీన్ని బట్టి ప్రభుత్వాధికారులు, అందునా పోలీసు అధికారులు కూడా అధికార పక్ష రాజకీయాలను సమర్థించే స్థితికి దిగజారారనుకోవాలి.

మతం మార్చే హిందూ అమ్మాయిలకు మరణ శిక్ష విధిస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ యథాలాపంగా చెప్పలేదు. మహిళా దినోత్సవం రోజున ఒక ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ఈ హెచ్చరిక చేశారు. తమ ప్రభుత్వం అమ్మాయిల గౌరవాదరాలను కాపాడడానికి కట్టుబడి ఉందట. ఆయనకు మత మార్పిడులు నచ్చకపోవచ్చు. కానీ మతం మారడానికి మన రాజ్యాంగం అనుమతిస్తుంది. పైగా మతం పూర్తిగా వ్యక్తిగత వ్యవహారం. నచ్చిన మతాన్ని ఎంపిక చేసుకునే అవకాశం మన రాజ్యాంగం ఇస్తోంది. అలాంటిది ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి మరణ శిక్ష విధించడం లాంటి కోర్టులు చేయాల్సిన పనిని తానే చేస్తానంటున్నారు. ఆయనకు ఈ అధికారం ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. కోర్టులు చేయాల్సిన పని కార్యనిర్వాహక వర్గమే చేసేటట్టయితే ఇక న్యాయవ్యవస్థతో పని ఉండకూడదుగా! అమ్మాయిల గౌరవాదరాలను కాపాడే క్రమంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కోర్టుల బాధ్యత కూడా ఆయనే తీసుకుంటానంటున్నారు. ఇది రెండు రకాలుగా అభ్యంతరకరమైంది. ఒకటి: మరణ శిక్ష విధించే అవకాశం మన చట్టాల్లో ఉంది. కానీ అరుదాతి అరుదైన సందర్భాలలోనే మరణ శిక్ష విధిస్తున్నారు. అసలు మరణశిక్షే అమానవీయమైంది. వ్యక్తులకు మరణ శిక్ష విధించడమే మానవీయం కాదని ప్రపంచం అంతా భావిస్తున్నప్పుడు మరణ శిక్షను సమర్థించడం ఆమోదకరమైంది కాదు. రెండు: కోర్టుల పరిధిలోకి కార్యనిర్వాహక వర్గం దూరిపోవడం రాజ్యాంగం నిర్దేశించిన అధికార విభజనను ఉల్లంఘించడమే. ఇక మహారాష్ట్ర మంత్రి నితీశ్ రాణె హిందువులు నడిపే మాంసం దుకాణాలకు ప్రత్యేక సర్టిఫికేట్లు ఇస్తారట. ఈ దుకాణాలలో మాంసంలో కల్తీ ఉండదట. అలాంటి కల్తీ జరిగినప్పుడు దాన్ని నిరోధించడానికి సమర్థమైన చట్టాలు ఇప్పటికే ఉన్నాయి. మళ్లీ ప్రత్యేకంగా హిందువులు నడిపే మాంసం దుకాణాలకు ప్రత్యేక సర్టిఫికేట్ ఇస్తామనడం, ఈ సర్టిఫికేట్లు లేని దుకాణాల్లో మాంసం కొనగూడదని కూడా రాణె హితవు పలికారు. ఆయన అసలు ఉద్దేశం ఏంటంటే హిందువులు కేవలం హిందువులు నడిపే మాంసం దుకాణాల్లోనే మాంసం కొనాలని. అంటే ఈ వ్యాపారానికి ముస్లింలకు వాటా లేకుండా చేయడం. అంతిమంగా ఇది హిందూ-ముస్లిం మాంసం దుకాణాలు ఏర్పాటు చేయడానికే దారి తీస్తుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర మంత్రి, ఉత్తరప్రదేశ్‌లోని సంభల్‌లోని పోలీసు ఉన్నతాధికారి కట్టగట్టుకుని ముస్లింల విషయంలో విద్వేషపూరిత ధోరణికి ఆజ్యం పోయడమే. విద్వేషం ఎన్ని రకాలుగా వెర్రి తలలు వేస్తుందో, దీని వెనక హిందుత్వ రాజకీయాలు ఆచరణలో ఎంత వివక్షాపూరితంగా తయారవుతున్నాయో ఆలోచిస్తే, మన రాజకీయాలు ఎంతగా దిగజారుతున్నాయో ఆలోచిస్తే దిగులు మాత్రమే మిగుల్తోంది. మత విద్వేషం ఎందుకు, ఎంత ప్రమాదకరమైందో జనం ఆలోచించగలగాలి. అన్ని రంగాల్లోనూ విద్వేషాన్ని అమలు చేయడానికి బీజేపీ కంకణం కట్టుకుంది. కేవలం ఎన్నికల సమయంలోనే బీజేపీ విద్వేష వమనం చేయడం లేదు. నిరంతరం విద్వేషం నింపడంలో మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, బీజేపీ కూడా మునిగి తేలుతున్నాయి. కేవలం మోదీ ప్రభుత్వ దుర్నీతి, గుప్పెడు మంది పెట్టుబడిదార్లకు లాభాలు నొల్లుకోవడానికి అవకాశం ఇచ్చే విధానాలు, నిరుద్యోగాన్ని బొత్తిగా పట్టించుకోకపోవడం మాత్రమే సమస్యలు కావు. దేశ జనం మూలుగల్లోకి విద్వేషం ఎక్కించడం అంతకన్నా పెద్ద ప్రమాదం.

## భలే మంచిరోజు

చింతపట్ల సుదర్శన్

బారెడు పొద్దెక్కింది. ఎండ చురుక్కుమంటున్నది. అయినా డాగీ ఎప్పటిలా లేచి మొరగలేదు. డాంకీ ఎప్పటిలా సంగీత సాధనకు పూనుకోలేదు. ఎండ చురుకు ఎక్కువైంది. వీధుల్లో జనం ఊరికే తిరగరు కదా అరిచి గీ పెడ్తారు కదా. ఆ అరుపులూ, కేకలకు మొదట కళ్లు తెరిచింది డాగీ. అలా తెరిచిన కళ్లను గోడవారన ఉన్న డాంకీ కేసి తిప్పింది. డాంకీ తోలు మందం కదా ఎండ చురుకు తగల్లేదేమో ఇంకా మూసిన కళ్లు తెరవనే లేదు.

లేచి ఒళ్లు విరుచుకుని మైదానం కేసి చూసింది డాగీ. మైదానం నిండా చిత్తు కాగితాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ కుర్చీల తాలూకు కాళ్లూ, చేతులు, లౌడ్ స్పీకర్ల కోసం పాతిపెట్టిన ఖాళీ గుంజలు కనిపించేయి. మైక్ టెస్టింగ్ కోసం హలో, హలో అని అరిచినట్టు నోరు తెరిచి రెండు 'భౌభౌ' లు గాల్లోకి విసిరేసింది.

### రంగస్థలం

అవి తెర్చుకుని ఉన్న డాంకీ చెవుల్లో దూరి, మూసుకున్న దాని కళ్లు తెరిచేయి.

ఏంటి 'బ్రో' నిద్ర చెడగొడ్తున్నావు అని విసుక్కుంది డాంకీ తెరిచిన కళ్లు నులుముకుంటూ. ఇంకా ఎంతసేపు పండుకుంటావు. మన మేమన్నా అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులమా సబ్సిడీ కేఫ్‌ల్లో చవగ్గా తిని త్రేన్చటానికి. తిండి కోసం ఒళ్లు దాచుకోకుండా వీధులన్నీ సర్వే చేయాలి కదా అంది డాగీ. అది సరేననుకో. కానీ రాత్రి మైదానంలో జరిగిన గలాటా చూశావు కదా. అరుపులు, కేకలు, చప్పట్లు, ఈలలు మైకుల్లో లౌడ్ స్పీకర్లను చిత్రవధ చేసిన ఉపన్యాసాలు అర్ధరాత్రి దాటిం తర్వాతే కదా సమావేశం చట్టుబండలయింది. కునుకు వేసే ఛాన్సు వచ్చింది అంది డాంకీ. నువ్వే కాదు నేను కూడా బాధితుడ్నే. చూడు మైదానం చెత్త కాగితాల్తో, విరిగిన వస్తువుల్తో ఎంత కళకళలాడ్తున్నదో. డాంకీ లేచి అరుగు చివరకు వెళ్లి ఎక్కడ చూసినా కాగితాలు, తిని పారేసిన పేపరు ప్లేట్లే. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభానంతర మైదానం ఇలాగ ఈకలు పీకిన కోడైయిందన్న మాట. అబ్బబ్బ ఏమి ఉపన్యాసాలు దంచారు. ప్రతిపక్షాల మీద ఏమి చురకత్తులు నూరారు అంది డాంకీ. చెప్పే వాడికి వినేవాడు ఎప్పుడూ లోకువే కదా. అయినా ఏడాదికి ఒక్క రోజన్నా ఆడ కూతుర్ల మీద ఈ మాత్రం గౌరవం... మమకారం చూపవలసిందే కదా. మళ్లీ ఏడు మార్చి 8 వరకూ సరిపోయేంత ఒలక బోయవలసిందే కదా అంది డాగీ. ప్రతి రోజూ ఎంత హింస పెట్టినా ఏటికి ఒక్కరోజన్నా 'ఇస్పెషల్' గా చూడాలి కదా అంది డాంకీ. ఎంత ప్రేమ ఒలకబోశారు సర్కారీ పెద్దలు. భారతీయ సంప్రదాయంలో స్త్రీలకు ఉన్న గౌరవాన్ని ఎంత చక్కగా చెప్పి గొప్ప చెక్క భజన చేశారు అంది డాగీ. అవునవును ఓ పక్క చెక్క భజన, మరోపక్క గత ప్రభుత్వం హయాంలో స్త్రీలకు జరిగిన అన్యాయాల వివరణ ఇవ్వడం, వారి కివ్వాల్సిన డబ్బు మింగేసిన పందికొక్కులను తిట్టిన తిట్టు రిపీటవకుండా తిట్టడం ఎంత రంజుగా ఉండిందో. నడి వేసవిలో చెమటలు పట్టేవాడికి 'ఐబాకో ఐస్‌క్రీం' తిన్న ఫీలింగు వచ్చేట్టు ఎన్ని వరాలు కురింపించారో ఎన్ని హామీలు గుప్పించారో అంది డాంకీ.

ఉద్యోగం రాక ముందే ఊబకాయం, బట్టతలా వచ్చేస్తయేమోనని భయపడి రోజూ బుద్ధిగా వాకింగ్‌కు వస్తున్న అబ్బాయి అరుగు ఎక్కాడు. మైదానం అంతా కుక్కలు చింపిన విస్తరి అయిందే సారీ డాగీ అలవాటులో పొరపాటు అన్నాడబ్బాయి. మీటింగ్‌కి నువ్వూ వచ్చావు కదా రాత్రి. ముగ్గురు మెయిన్ దేవుళ్లే కాక ముప్పయి మూడు కోట్ల మంది దేవతలు దిగివచ్చినా ధైర్యం చేసి ఇవ్వలేని వరాలన్నీ గుప్పించి వదిలేరు మైకుల్లో అంది డాగీ.

అవును. చెప్పే వరాలే కాని ఇచ్చే వరాలు కావుగదా. నోరు జారడమే కాని చేయి విదిల్చేది ఉండదు కదా. అక్కచెల్లెమ్మల కోసం ఆ మాత్రం నోరు పారేసుకోక పోతే బావుండదు కదా. అక్కలయితేనేం చెలమ్మలయితేనేం అందరినీ కోటీశ్వరాళ్లను చేస్తాం అన్నారు. అదానీ అంబానీలను చేస్తామన్నారు. అందరికీ రైసు మిల్లులిస్తామన్నారు. గోదాములు కట్టిస్తామన్నారు. స్వంతంగా కరెంటు తయారు చేసుకోండని అన్నారు. ఈ మాత్రం 'మస్కా' లేకుండా రేపు ఓటు కోసం నమస్కారాలెలా చేస్తారు మరి అన్నాడు అబ్బాయి.

ఆడాళ్లకో రోజు, మగాళ్ల కోరోజు, ముసిలాళ్లకోరోజు, పడుచోళ్లకో రోజు, బుడ్డోళ్లకో రోజు, సర్కారోళ్లు మాటల మూటలు పంచడానికున్నయి ఎన్నో భలే మంచి రోజులు అని నడ్డి తిప్పుతూ 'డాన్సు' చేసింది డాగీ.

# తెలుగు ప్రగతికి కొత్త గొంతులు కావాలి

డాక్టర్ జీకేడీ ప్రసాదరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించింది. కూటమి ప్రభుత్వం తెలుగుభాషపై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేసి మరిన్ని ప్రత్యేక నిధుల్ని సమకూర్చాలని తెలుగు భాషాభిమానులంతా కోరుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో తెలుగు భాష నిరాదరణకు గురయిన సంగతి భాషాభిమానులందరికీ ఎరుకే. తెలుగు అధికార భాషాసంఘం, తెలుగు అకాడమీ, ప్రెస్ అకాడమీ స్థానంలో అవతరించిన రాఘవాచారి మీడియా అకాడమీ, సాహిత్య అకాడమీ, ఫిల్మ్, టెలివిజన్, రంగస్థల అభివృద్ధి సంస్థలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి సంబంధించిన అన్ని ప్రభుత్వ సంస్థల్నీ రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చేశారు. ఆయా సంస్థల అజెండాలను పక్కనబెట్టి జీతాలు తీసుకుంటూ పార్టీ అజెండాను భుజాన మోశారు. ఇదే నీతిమాలిన ఆచరణ అని మేధావి వర్గం గొంతు చించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు నిర్వహించిన ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆరోగ్య సమస్యలతో ఎక్కువకాలం విదేశాల్లో ఉండిపోయారు. ఎన్టీఆర్ పేరు తొలగించి ఆరోగ్య విశ్వవిద్యాలయానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టిన సమయంలో ఆయన ఆరోగ్యసమస్యలను పేర్కొంటూ రాజీనామా చేశారు. ఈ సంఘం సభ్యులుగా నియమించిన వృద్ధులదీ అదే పరిస్థితి. జిల్లా కమిటీలు నియమించకుండా తెలుగుభాషకు తీరని ద్రోహం చేసింది ఈ సంఘం. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ పదవిని పార్టీ కార్యకర్త దేవిరెడ్డి శ్రీనాథ్ రెడ్డికి కట్టబెట్టారు. తర్వాత దీని పేరును సి. రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీగా మార్చారు. 2022లో రాజకీయ అవసరాల కోసం ఈ పదవిలో కొమ్మినేని శ్రీనివాసరావుని నియమించారు. ఆయనతో కూడా ప్రతిపక్షం మీద విమర్శలు చేయించారు. తర్వాత వైసీపీ వ్యూహాలకు అనుగుణంగా ఆయన కొనసాగలేక రాజీనామా చేశారు. రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా నటుడు పోసాని కృష్ణ మురళి నియామకం కూడా ఇటువంటిదే. ఇప్పుడు ఈయన మీద కూటమి ప్రభుత్వం కేసులు కూడా పెట్టింది. ఇదంతా పార్టీ, ప్రభుత్వ పెద్దలు నాతో చేయించారని ఆయనే స్వయంగా మీడియా, పోలీసులు ముందు ఒప్పుకున్నారు. ఇది గత ప్రభుత్వంలో తెలుగు భాషాభివృద్ధికి చెందిన సంస్థల దుస్థితి. ఇప్పుడు

తెలుగు భాషాభివృద్ధికి కొత్త గొంతులు కావాలి. స్వచ్ఛమైన ఆచరణ, ఆవిష్కరణలతో వికసింపజేయాలి.

బ్రిటీష్ పాలకులు ప్రాంతీయ భాషలు, సంస్కృతుల ప్రాధాన్యతను గుర్తించి స్థానిక విద్యావిధానాన్ని రూపొందించారు. వీరి సొంత ప్రయోజనాలు కూడా దీనిలో వున్నాయి. స్థానిక విద్య నాడు భారత ప్రజల సాంస్కృతిక పరిరక్షణ, సాధికారతకు ఒక సాధనంగా పరిణమించింది. 1878 వెర్నాక్యులర్ ప్రెస్ యాక్టు తర్వాత స్థానిక భాషలకు ప్రోత్సాహం లభించింది. చాలా మంది బ్రిటీష్ అధికారులు పట్టుదలగా భారతీయ భాషలను నేర్చుకున్నారు. సి.పి. బ్రౌన్ తెలుగు భాష నేర్చుకొని నిఘంటువు రాశారు. నాటి నుంచి మాండలిక, జానపద విజ్ఞానంతో పాటు తెలుగు భాషాపరంగాను, సాహిత్య పరంగాను ఎంతో వికాసం చెందింది. తెలుగు భాషా, సాహిత్యోద్యమాలు తెలుగు విజ్ఞానాన్ని సుసంపన్నం చేశాయి. తర్వాత వచ్చిన ప్రపంచీకరణ ప్రభావంతో ఇంగ్లీషు భాష ఆధిపత్యంతో తెలుగుభాష రోజు రోజుకి మసకబారిపోతోంది. దీనికి తోడు గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీషు మీడియం విద్యను ప్రవేశపెడుతూ తెలుగుభాష ప్రాభవాన్ని తగ్గించింది.

2008లో తెలుగు ప్రాచీన భాషా హోదా సాధించిన నాటి నుంచి ఏడాదికి కోటి రూపాయలు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరవుతున్నాయి. ఈ నిధులు నిర్మాణాత్మకంగా సద్వినియోగం జరిగిన ఫలితాలు కానరావడం లేదు. ప్రాచీన భాషగా తెలుగును గుర్తించడంతో ముఖ్యంగా విద్యా, పరిశోధన రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావించింది. పురాతన గ్రంథాల సంరక్షణ, డాక్యుమెంటేషన్, డిజిటలైజేషన్, అనువాదం, ప్రచురణ, డిజిటల్ మీడియా వంటి రంగాల్లో విస్తృతంగా ఉద్యోగాలకు అవకాశాలు సృష్టించింది. ఈ ఒరవడి సాంస్కృతిక గుర్తింపు, పరిశోధన, సంరక్షణ, పురాతన గ్రంథాలు, నాలెడ్జ్ హబ్‌ల వంటి వ్యవస్థల పునరుజ్జీవాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ కార్యాచరణలో జాతీయ సమైక్యతను ప్రోత్సహించడం కూడా ప్రధానమైన అంశం. వీటన్నింటినీ నేటి ప్రభుత్వం గుర్తించి మరింత అభివృద్ధికి విధాన రూపకల్పన చేయాలి.

> 2008లో తెలుగు ప్రాచీన భాషా హోదా సాధించిన నాటి నుంచి ఏడాదికి కోటి రూపాయలు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరవుతున్నాయి. ఈ నిధులు నిర్మాణాత్మకంగా సద్వినియోగం జరిగిన ఫలితాలు కానరావడం లేదు. ప్రాచీన భాషగా తెలుగును గుర్తించడంతో ముఖ్యంగా విద్యా, పరిశోధన రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావించింది. పురాతన గ్రంథాల సంరక్షణ, డాక్యుమెంటేషన్, డిజిటలైజేషన్, అనువాదం, ప్రచురణ, డిజిటల్ మీడియా వంటి రంగాల్లో విస్తృతంగా ఉద్యోగాలకు అవకాశాలు సృష్టించింది. ఈ ఒరవడి సాంస్కృతిక గుర్తింపు, పరిశోధన, సంరక్షణ, పురాతన గ్రంథాలు, నాలెడ్జ్ హబ్‌ల వంటి వ్యవస్థల పునరుజ్జీవాన్ని ప్రోత్సహిస్తుంది.

భారత ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో ప్రాంతీయ భాషల పరిరక్షణకు పెద్ద పీట వేసింది. దేశవ్యాప్తంగా ఈ నిర్ణయం ప్రశంసలు పొందింది. ఈ సందర్భంలో భారతదేశంలోని స్థానిక భాషా మాధ్యమ పాఠశాలలను ఆంగ్ల మాధ్యమ పాఠశాలలుగా మార్చడం వల్ల నష్టాలు కూడా వున్నాయని కొన్ని అధ్యయనాలు హెచ్చరించాయి. మాతృభాషలో బోధన చేస్తే విద్యార్థులు భావనలను సులభంగా అర్థం చేసుకుంటారు. సుపరిచితమైన పదాలు, పదబంధాలు, మాండలికాలు ఉపయోగించి వివరించే అవకాశం వుంటుంది. దీంతో విద్యార్థుల విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం సులభమవుతుంది. దేశ వ్యాప్తంగా ఒక స్థాయి వరకు మాతృభాషలను బోధనలో కొనసాగిస్తే భారతీయ భాషల పునరుజ్జీవనం జరుగుతుందని నూతన విద్యావిధానం వివరిస్తుంది.

ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోలు, న్యాయస్థానాల తీర్పులు తెలుగులో ప్రచురించామని ప్రభుత్వం నుంచి ఏడాదికి ఒకసారి కొన్ని వార్తలు కనబడతాయి. తర్వాత దీని కార్యాచరణ ఎక్కడా కనిపించదు. ఎప్పటికప్పుడు వీటి తెలుగు అనువాద కాపీలను అందుబాటులోకి తీసుకొచ్చి తెలుగు భాష పట్ల అంకితభావాన్ని నిరూపించుకోవాలి. సక్రమంగా ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణతో మేథోమథనం చేపట్టాలి. తెలుగు పత్రికారచనతో నూతన ఆవిష్కరణలను సృష్టించాలి. తెలుగు సాహిత్యానికి తగిన గౌరవం కల్పించాలి. తెలుగు కళలకు జీవంపోసి ప్రాణప్రతిష్ఠ చేయాలి. ప్రతి విద్యార్థికి తెలుగు సాంకేతికతలో కంప్యూటర్ శిక్షణ అందించాలి. తెలుగు భాషకు డిజిటల్ సాంకేతిక సామర్థ్యాలను అనుసంధానం చేయాలి. 'కృత్రిమ మేధ' అనేది ప్రపంచ మేధావులు ఆవిష్కరించిన గొప్ప సాంకేతిక విప్లవం. దీన్ని ప్రాంతీయ భాషలకు అనుసంధానించి గొప్ప మార్పులు తీసుకురావచ్చు.

**ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్,**
**ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం,**
**మొబైల్: 9393111740**

# గోవా విముక్తి ఉద్యమ యోధుడు చిటాలే

ఆర్వీ రామారావ్

గోవా విముక్తి కోసం సీపీఐ నిర్వహించిన సత్యాగ్రహంలో మొదటి బృందానికి నాయకత్వం వహించింది విష్ణు దామోదర్ చిటాలే. ఈ బృందంలో వెయ్యి మంది పాల్గొన్నారు. ఇందులో అప్పటికి విద్యార్థిగా ఉన్న గోవింద్ పన్సారే కూడా పాల్గొన్నారు. ఈ సత్యాగ్రహంలో భగత్‌సింగ్ సన్నిహిత సహచరుడైన కమ్యూనిస్టు నాయకుడు పండిట్ కిశోరీలాల్ కూడా ఉన్నారు. సత్యాగ్రహులంతా బందా సరిహద్దులో గుమిగూడారు. వారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బందా సరిహద్దుకు చేరారు. అక్కడ భారీ సంఖ్యలో జనం ఉన్నారు. అనేకమంది పత్రికా రచయితలూ చేరారు. గోవా సరిహద్దుకు ఆవలి వైపున పోర్చుగీసు సైన్యం స్టెన్ గన్లతో సిద్ధంగా ఉన్నది. సత్యాగ్రహులు సరిహద్దు దాటగానే పోర్చుగీసు దళాలు కాల్పులు జరిపాయి. చిటాలేను హతమార్చడానికి సైనికులు తూటా వదిలారు. కానీ ఈ లోగా కర్నాల్ సింగ్ చిటాలేను కాపాడడానికి అడ్డు వచ్చారు. కర్నాల్ సింగ్ త్రివర్ణ ప్రతాకాన్ని తీసుకుని ముందుకు కదిలారు. అంతే తూటా ఆయన ప్రాణం తీసింది. కర్నాల్ సింగ్ మరణం చిటాలేను చాలా కాలం వేధించింది. షేక్ సనాఉల్లాకు కడుపులో బుల్లెట్ దిగింది. ఓక్‌కు మూడు బుల్లెట్లు దిగి నేలకూలాడు. ఈ లోగా మధ్యప్రదేశ్‌కు చెందిన సహోదరా దేవి త్రివర్ణ పతాకంతో ముందుకు సాగారు. తూటా పేలింది ఆమె అక్కడికక్కడే మరణించారు. భారీ సంఖ్యలో జనం సరిహద్దు వేపు పరుగెత్తారు.

గోవా విమోచనకోసం సత్యాగ్రహం చేయాలన్న ఆలోచన చిటాలేదే. 1955 జూన్-జులై నెలల్లో ఆయన ఈ ప్రతిపాదన చేశారు. ఆయనకు గోవా అణువణువూ తెలుసు. గోవా విమోచనకు సత్యాగ్రహమే బలమైన ఆయుధం అని ఆయన భావించారు. అనేకమంది ఈ ప్రతిపాదనకు సమ్మతించలేదు. కానీ చిటాలే పట్టు వదలలేదు. 1955 మేలో గోవా విమోచన సమితి ఏర్పడింది. అందులో సీపీఐతో సహా అన్ని పార్టీల వారూ ఉన్నారు. కాంగ్రెస్, జనసంఘ్, రైతుల ప్రతినిధులు కూడా ఆ కమిటీలో ఉండేవారు. ఈ కమిటీలో గోవా విమోచనకు అనుసరించవలసిన మార్గంపై విస్తృత చర్చలు జరిగాయి. చివరకు సత్యాగ్రహం చేయాలన్న చిటాలే ప్రతిపాదనపై అంగీకారం కుదిరింది. సత్యాగ్రహులను ఊచకోత కోయడానికి పోర్చుగీసు అధికారులు సిద్ధంగా ఉన్నారు. సత్యాగ్రహులను వెనక్కు పంపించాలని గోవా విమోచన సమితి భావించింది. అది అంత సులభం కాలేదు. వారిని ఒప్పించే బాధ్యతను దాంగేకు అప్పగించారు. ఆయన వెనక్కు పంపడంలో సఫలమయ్యారు. తెరెఖోల్, సుర్లే, కాజిల్ రాక్ లాంటి చోట్ల సత్యాగ్రహులు గోవాలోకి ప్రవేశించగలిగారు. కానీ పోర్చుగీసు దళాలు వారి మీద భారీ స్థాయిలో అణచివేతకు పాల్పడ్డాయి. ఈ క్రమంలో అనేక మంది ప్రాణత్యాగం చేయవలసి వచ్చింది.

1955లో సత్యాగ్రహుల నాల్గో దళం సిద్ధమైంది. అప్పుడు చిటాలే హఠాత్తుగా అయిదుగురు సత్యాగ్రహులను పక్కకు పిలిచి జూన్ 18 గోవాలో విప్లవ దినోత్సవం అని చెప్పారు. అందువల్ల పనాజీలో సెక్రటేరియట్‌పై పోర్చుగీసు జెండా దించేసి త్రివర్ణ పతాకం ఆవిష్కరించాలని చెప్పారు. ఆ అయిదుగురు గుట్టుచప్పుడు కాకుండా పోర్చుగీసు కోటకు చేరుకుని త్రివర్ణ పతాకం ఎగురవేశారు. 1955 జూన్ 25-26 తేదీ పత్రికల్లో ప్రముఖంగా ప్రచురితమైంది. ఈ అయిదుగురిని చిటాలే విజేతలైన పాండవులు అనే వారు.

**సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం:**

1956 ఆరంభంలో సంయుక్త మహారాష్ట్ర సమితి (ఎస్.ఎం.ఎస్.) బొంబాయిలో సార్వత్రిక సమ్మె నిర్వహించింది. చిటాలే పుణేలో సత్యాగ్రహం ప్రారంభించారు. ఆయన ఎస్.ఎం.ఎస్. ఉద్యమంలో చురుకైన నాయకుడిగా ఉన్నారు. ఆయనను ఆరంభంలోనే అరెస్టు చేసి 1957లో గానీ విడుదల చేయలేదు. 1957 సార్వత్రిక ఎన్నికలలో పుణే నుంచి చిటాలే బొంబాయి శాసనసభకు ఎన్నికయ్యారు. సంయుక్త మహారాష్ట్ర సమితి అభ్యర్థిగా ఆయన గెలుపొందారు. 1961 డిసెంబర్‌లో తప్ప గోవా విముక్తి సాధ్యం కాలేదు. గోవా విమోచన కాక ముందే 1961 మేలో 56 ఏళ్ల వయసులో చిటాలే మరణించారు.

## అంతర్జాతీయ డ్రగ్ డీలర్ అరెస్టు

**చండీగఢ్:** అమెరికా సహా అనేక దేశాలకు మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న అంతర్జాతీయ డ్రగ్ డీలర్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎఫ్‌బీఐ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇంటర్నేషనల్ డ్రగ్ లార్డ్ షెహనాజ్ సింగ్ అలియాస్ షాన్ భిందేర్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ డీజీపీ సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. నార్కోటిక్స్ సిండికేట్‌లో అతడు కీలకంగా వ్యవహరిస్తున్నాడని, కొలంబియా నుంచి అమెరికా, కెనడాలోకి మాదకద్రవ్యాలు స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. షెహనాజ్ అక్రమాలపై ప్రత్యేక నిఘా పెట్టిన అమెరికా ఎఫ్‌బీఐ ఫిబ్రవరి 26న అతడి అనుచరులను అరెస్టు చేసింది. వారి నుంచి 391 కేజీల మెథంఫెటమైన్, 109 కేజీల కొకైన్ సహా నాలుగు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాలతో షెహనాజ్ భారత్‌కు పారిపోయి వచ్చాడు. నిఘా వర్గాల సమాచారం మేరకు పంజాబ్ తర్న్ తరణ్ పోలీసులు రహస్య ఆపరేషన్ చేపట్టారు. అతడి జాడ గుర్తించి తాజాగా అరెస్టు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యవస్థీకృత నేరాల కట్టడికి తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పేందుకు ఈ ఆపరేషన్ నిదర్శనమని పంజాబ్ పోలీసులు వెల్లడించారు. డ్రగ్ స్మగ్లర్లు, నేరస్తులకు పంజాబ్ స్వర్గధామం కాదని హెచ్చరించారు.

## 16న భారత్‌కు న్యూజిలాండ్ ప్రధాని

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టఫర్ లుక్సాన్ భారత్‌లో పర్యటించనున్నారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మార్చి 16న భారత్‌కు రానున్నట్లు విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. వాణిజ్యం, పెట్టుబడులు సహా కీలకమైన అంశాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపింది. ప్రధాని మోదీతో చర్చలు జరపడంతో పాటు మార్చి 17న న్యూఢిల్లీలో జరగనున్న 10వ రైసినా డైలాగ్ ప్రారంభ సమావే శంలో క్రిస్టఫర్ ముఖ్య అతిథిగా కీలక ప్రసంగం చేయనున్నారని విదేశాంగ శాఖ పేర్కొంది. మార్చి 17న భారత్-న్యూజిలాండ్ సంబంధాలు సహా అనేక అంశాలు ప్రధానితో చర్చించనున్నారు. రాష్ట్రపతితో సమావేశమైన అనంతరం మోదీ ఇచ్చే ప్రత్యేక విందులో పాల్గొంటారు. న్యూజిలాండ్ ప్రధానితో పాటు మంత్రులు, సీనియర్ అధికారులు, వ్యాపారవేత్తలు, మీడియా, అత్యున్నతస్థాయి ప్రతినిధులు సహా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం భారత్‌లో పర్యటించనుంది. మార్చి 19, 20 తేదీలలో ముంబైలోనూ పర్యటించనున్నారని తెలిపింది. ప్రధాని హోదాలో ఇది క్రిస్టఫర్ లుక్సాన్ భారత్‌లో మొదటి పర్యటన కానుంది.

## ఆపరేషన్ కగార్‌ను ఎదుర్కొంటాం: మావోయిస్టులు

**రాయ్‌పూర్:** సౌత్ బస్తర్ డీవీసీఎం సభ్యుడు మొడియం దినేశ్, అతని భార్య కళ పార్టీ డబ్బుతో పారిపోయి పోలీసులకు లొంగిపోయారని మావోయిస్టు పార్టీ సోమవారం ఓ లేఖలో పేర్కొంది. ఇరవై ఏళ్ల ఉద్యమ జీవితంలో ఉన్న దినేశ్ పార్టీకి ద్రోహం చేశారని లేఖలో ప్రస్తావించింది. తీవ్రమైన అణచివేతకు గురైన వారు శత్రువుకు లొంగిపోతారని మావోయిస్ట్‌లు తెలిపారు. త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని 'ఆపరేషన్ కగార్' యుద్ధాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. సౌత్ సబ్ జోనల్ బ్యూరో పేరుతో మావోయిస్ట్‌లు లేఖ విడుదల చేశారు. కాగా... దండకారణ్యం, చత్తీస్‌గఢ్ అడవుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కొంతకాలంగా మావోయిస్ట్‌లు డిమాండ్ చేస్తున్నారు. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్ర ప్రభుత్వం హతమారుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అడవుల్లో జీవిస్తున్న ఆదివాసీలను వెళ్లగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, ఆదివాసీలకు మావోయిస్టులు అండగా ఉంటారని తెలిపారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపార ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనిని ప్రజలు, మేధావులు తిప్పికొట్టాలని మావోయిస్ట్‌లు పిలుపునిచ్చారు.

## అసెంబ్లీని ఊపేసిన అర్ధనగ్న ఫ్యాషన్ షో

**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన అర్ధనగ్న ఫ్యాషన్ షో అసెంబ్లీని ఊపేసింది. పవిత్ర రంజాన్ మాసం వేళ ఇలాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని ప్రతిపక్ష నేతలు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వంపై మండిపడ్డారు. దీంతో అసెంబ్లీలో పెద్దఎత్తున గందరగోళం నెలకొంది. అంతకుముందు ఉత్తర కశ్మీర్ గుల్మార్గ్‌లోని ప్రముఖ స్కై రిసార్టులో ఆదివారం ప్రభుత్వ అధికారుల అధ్వర్యంలో ఫ్యాషన్ షో నిర్వహించారు. పురుషులు, మహిళలు రెచ్చగొట్టే తరహాలో దుస్తులు ధరించారని స్థానిక మత పెద్దలతో పాటు హురియత్ కాన్ఫరెన్స్ చీఫ్ మిర్వాయిజ్ ఉమర్ ఫారూక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దారుణంగా ఉందని విమర్శించారు. ఫ్యాషన్ షోకు సంబంధించిన చిత్రాలు, వీడియో తమను దిగ్భ్రాంతికి గురి చేశాయని అన్నారు. సూఫీ, సాధు సంస్కృతి, ప్రజల మతపరమైన దృక్పథానికి పేరుగాంచిన లోయలో దీన్ని ఎలా సహించాలి... ఇందులో పాల్గొన్న వారిని వెంటనే జవాబుదారీగా చేయాలి అని మండిపడ్డారు. పర్యాటకంపై ప్రచారం పేరుతో ఈ అశ్లీల ప్రదర్శన ఏమిటని విపక్షాలు, ప్రజలు... అబ్దుల్లా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఫ్యాషన్ షోపై సీఎం స్పందించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇలాంటి ఫ్యాషన్ షో జరగడం పట్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, ప్రజల కోపాన్ని తాము అర్థం చేసుకున్నామని చెప్పారు. తన కార్యాలయం అధికారులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ పరిణామంపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, ఫ్యాషన్ షోలో మహిళలు, పురుషులు పొట్టి దుస్తులతో తెల్లటి మంచుపై ర్యాంప్ వాక్‌కు సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవడంతో ప్రతిపక్షాల ఆగ్రహానికి గురికావాల్సి వచ్చింది.

# డీఎంకే వర్సెస్ బీజేపీ

- దద్దరిల్లిన పార్లమెంట్
- ఉభయసభల్లో నిరసనలు
- ఎన్ఈపీ, త్రిభాషా విధానంపై ఆందోళన

**న్యూఢిల్లీ:** బీజేపీ, డీఎంకే నేతల మాటల యుద్ధంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. సోమవారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో సెషన్ ప్రారంభం కాగానే డీఎంకే ఎంపీలు లోక్‌సభలో ఆందోళనకు దిగారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), త్రిభాషా సిద్ధాంతానికి వ్యతిరేకంగా కేంద్రంపై విమర్శలు గుప్పించారు. డీఎంకే ఎంపీల తీరుపై కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. 'డీఎంకే ఎంపీలు నిజాయతీ లేనివారు. వారు తమిళనాడు విద్యార్థుల పట్ల నిబద్ధత కలిగి లేరు. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. వారి ఏకైక పని భాషా అడ్డంకులు పెంచడమే. విద్యను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారు. సభలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. డీఎంకే ఎంపీలు అప్రజాస్వామికులు, అనాగరికులు' అంటూ కేంద్రమంత్రి ఎదురుదాడికి దిగారు. ఆయన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన డీఎంకే ఎంపీలు... ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభలో గందరగోళం నెలకొనడంతో స్పీకర్ లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ తిరిగి ప్రారంభమైన తర్వాత ప్రధాన్ వ్యాఖ్యలపై డీఎంకే నిరసన వ్యక్తం చేసింది.

**ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలకు కనిమొళి ఖండన**

'డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... కేంద్రమంత్రి డీఎంకే ఎంపీలు, తమిళనాడు ప్రభుత్వం, తమిళనాడు ప్రజలను అనాగరికులు అనడాన్ని తీవ్రంగా ఖండించారు. మంత్రి వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. మంత్రి వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. ఈ వివాదం ఎన్ఈపీపై జరుగుతున్న చర్చ నుండి వచ్చింది. ముఖ్యంగా తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వివాదాస్పద త్రిభాషా విధానం నుండి వచ్చింది. సమావేశంలో తమిళనాడు ప్రతినిధులు ఎన్ఈపీ గురించి తమ ఆందోళనలను స్పష్టంగా వ్యక్తం చేశారని కనిమొళి స్పష్టం చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లకు లేఖ రాశారని... ఎన్ఈపీతో రాష్ట్రానికి ఉన్న ఆందోళనలు, త్రిభాషా విధానంపై వ్యతిరేకతను అధికారికంగా వివరిస్తున్నారని ఆమె ప్రస్తావించారు. "ఎన్ఈపీతో మాకు సమస్యలు ఉన్నాయని, దానిని పూర్తిగా ఆమోదించలేమని, నిధులు విడుదల చేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి ప్రధానమంత్రి, విద్యా మంత్రికి లేఖ రాశారు" అని కనిమొళి తెలిపారు. రాజ్య సభలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. డీలిమిటేషన్, త్రిభాషా సిద్ధాంతం, మణిపూర్ అల్లర్లపై విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. దీంతో డిప్యూటీ చైర్మన్ రాజ్యసభను వాయిదా వేశారు. బీజేపీ, డీఎంకే నేతల మాటల యుద్ధంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. రాజ్యసభలో త్రిభాష విధానం, డీలిమిటేషన్ అంశాలను డీఎంకే లేవనెత్తింది. అనంతరం సభ నుంచి సభ్యులు వాకౌట్ చేశారు. ఈ అంశంపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చెలరేగింది. విపక్షం వాకౌట్‌పై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా విమర్శలు గుప్పించారు. విపక్షాలు వాయిదా తీర్మానానికి ముందు నిబంధనలను చదువుకోవాలన్నారు. వాళ్లు ఏమాత్రం బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారనీ, ఎల్ఓపీ సహా విపక్ష నేతలు రిఫ్రెషింగ్ కోర్సుకు వెళ్లి నియమ నిబంధనలను అవగాహన చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ విపక్ష సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తుండటం పార్లమెంటరీ వ్యవస్థ ప్రతిష్ఠను తగ్గించడమేనని విమర్శించారు. నిబంధనల కింద ప్రతి అంశాన్ని చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

**పార్లమెంటు వెలుపల డీఎంకే ఎంపీల నిరసన**

డీలిమిటేషన్ అంశంపై సోమవారం పార్లమెంట్ ఆవరణలో డీఎంకే ఎంపీలు నిరసన చేపట్టారు. డీఎంకేకి సంఘీభావంగా కొంతమంది ఇతర పార్టీల ఎంపీలు కూడా నిరసనలో పాల్గొన్నారు. డీఎంకే తిరుచ్చి శివ మీడియాతో మాట్లాడుతూ... డీలిమిటేషన్ ప్రక్రియకు బదులుగా ప్రత్యామ్నాయాన్ని చేపట్టాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం పడుతుందని మండిపడ్డారు. రాజ్యాంగం ప్రకారం.. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తు 2026లో జరగనుందని... అదే జరిగితే..... తమిళనాడు సహా అన్ని దక్షిణాది రాష్ట్రాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయని పునరుద్ఘాటించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని రూపొందించాలని అభ్యర్థిస్తున్నామని అన్నారు. జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే తమిళనాడు సహా పలు రాష్ట్రాలు చాలా సీట్లను కోల్పోవలసి వుంటుందని అన్నారు. తమిళనాడు 39 సీట్ల నుండి 31కి, కేరళ 20 నుండి 12కి పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు 30 నుండి 40కి పెరుగుతాయని, దీంతో పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలు సమాన ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయని అన్నారు. మరో ఎంపీ కనిమొళి మాట్లాడుతూ... రాష్ట్రం త్రిభాషా విధానానికి అంగీకరించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు రూ. 2వేల కోట్లకు పైగా పాఠశాల నిధులను నిలిపివేసిందన్నారు. కేంద్ర విద్యా మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. "కేంద్ర విద్యా మంత్రి మా ప్రభుత్వం, ప్రజలు, తమిళనాడు పార్లమెంటు సభ్యులను అబద్ధాలకోరులన్నారు. ఆయన మమ్మల్ని అనాగరికులు అని పిలిచి మా మనోభావాలను, తమిళనాడు ఆత్మగౌరవాన్ని గాయపరిచారు... మేము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము" అని ఆమె అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ దురహంకారం: స్టాలిన్

లోక్‌సభలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను తమిళనాడు సీఎం స్టాలిన్ ఖండించారు. 'మీరు తమిళనాడు ప్రజలను అవమానిస్తున్నారు. గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీన్ని అంగీకరిస్తారా?' అని స్టాలిన్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో ఒక సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఈ పోస్టుకు ప్రధాని మోదీని కూడా టాగ్ చేస్తూ కొనసాగించారు. 'నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం మీ త్రిభాషా సూత్రం అమలు కోసం మేం ముందడుగు వేయలేం. త్రిభాషా సూత్రాన్ని అమలుపర్చాలని మాపై ఎవరూ ఒత్తిడి చేయలేరు' అని పేర్కొన్నారు. అదేవిధంగా తమిళనాడు స్కూళ్లలో హిందీ బోధనను అమలు చేయకపోతే విద్యాశాఖ నిధులు నిలిపివేస్తామని గత నెలలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను స్టాలిన్ గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్రమోదీ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు బ్లాక్ మెయిల్ హెచ్చరికలని స్టాలిన్ ఆరోపించారు. ఇది కేంద్ర ప్రభుత్వం దురహంకారమని ఆయన మండిపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు?

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మోదీ సర్కార్ శుభవార్త చెప్పనుంది. ఈ ఏడాది హోలీ పండగ లోపు ఉద్యోగులకు కేంద్ర కేబినెట్ తీపి కబురు చెప్పనుంది. మార్చి 14న జరిగే హోలీ పండగకు ముందే ఉద్యోగులు, పెన్షనర్లకు డియర్‌నెస్ అలవెన్స్(డీఏ), డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)ని పెంచుతూ ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్రం డీఏ, డీఆర్ పెంచితే ఏకంగా 1.2 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుంది. డిసెంబర్ 2024కి సంబంధించిన ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ డేటా ప్రకారం ఈ ఏడాది డీఏలో 2 శాతం పెరుగుదల ఉంటుందని తెలుస్తోంది. అయితే తుది నిర్ణయం ప్రధాని నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ చేతుల్లోనే ఉంటుంది. ఏటా ఆరు నెలలకు ఓసారి అంటే జనవరి, జులై నెలల్లో రెండుసార్లు డీఏ, డీఆర్‌ను సవరిస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేస్తుంటుంది. అదేవిధంగా ఈ ఏడాదీ ఇది కొనసాగుతుందని ఉద్యోగులు, పెన్షనర్లు ఆశిస్తున్నారు. జనవరి నుంచి చేసే డీఏ, డీఆర్ సవరణలను మార్చిలో, జులైకి సంబంధించి అక్టోబర్, నవంబర్ నెలల్లో ప్రకటనలు చేస్తుంటారు. వీటి కోసం లబ్ధిదారులు వెయ్యి కళ్లతో ఆశగా ఎదురుచూస్తుంటారు. ఈసారి మార్చి 5న న్యూఢిల్లీలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో డీఏ పెంపుపై ఎలాంటి చర్చ జరగలేదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లలో ఉత్కంఠ నెలకొంది. చివరి డీఏ పెరుగుదల జులై 2024లో 50 శాతం నుంచి 53 శాతానికి పెంచింది. మార్చి 7, 2024న జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో డీఏను 46 నుంచి 50 శాతానికి పెంచారు. ఇది హోలీకి కొద్ది రోజుల ముందు మార్చి 25, 2024న అధికారికంగా ప్రకటించారు. అలాగే ప్రభుత్వం 7వ వేతన కమిషన్ కింద అక్టోబర్ 16, 2024న డీఏ, డీఆర్‌ను మరోసారి పెంచింది. ఈసారి 3 శాతం పెంచి ఏకంగా 53 శాతానికి తీసుకెళ్లింది. దీన్ని జులై 1, 2024 నుంచి అమలు చేశారు. దీంతో ఈసారీ భారీగానే పెంచుతారని అంతా భావిస్తున్నారు. జనవరి 2025లో కేంద్రం 8వ వేతన సంఘం కోసం ప్రణాళికలు ప్రకటించింది. ఇది వచ్చే ఏడాది నాటికి అమలులోకి వస్తుంది. ఒకవేళ 8వ వేతన సంఘం అమలులోకి వస్తే ఉద్యోగుల జీతాలు, పెన్షన్లలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని అంతా భావిస్తున్నారు. వారి ఆదాయం భారీగా పెరిగే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. 8వ వేతన సంఘం అమల్లోకి వస్తే ఇప్పటికే ఉన్న అలవెన్సులు రద్దయి... కొత్తవి ప్రవేశపెట్టవచ్చని నివేదికలు చెబుతున్నాయి.

## నీటిశుద్ధి రసాయనంపై 'యాంటీ డంపింగ్ డ్యూటీ'

**న్యూఢిల్లీ:** చైనా, జపాన్ నుండి దిగుమతి చేసుకునే నీటిశుద్ధి రసాయనంపై భారత్ యాంటీ-డంపింగ్ సుంకం విధించింది. ఈ రసాయనంపై భారత్ ఐదేళ్ల పాటు టన్నుకు 986 డాలర్ల వరకు యాంటీ డంపింగ్ సుంకం విధిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. రద్దు చేయకపోతే, భర్తీ చేయకపోతే, సవరించకపోతే విధించిన యాంటీ డంపింగ్ సుంకం ఐదు సంవత్సరాలు కొనసాగుతుందని నోటిఫికేషన్ పేర్కొంది. వాణిజ్య శాఖ దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డీజీటీఆర్) సిఫార్సుల మేరకు 'ట్రైక్లోరో ఐసోసైన్యూరిక్ యాసిడ్'పై సుంకం విధించాలని నిర్ణయించినట్లు తెలిపింది. చైనా, జపాన్ నుండి భారత్‌లోకి దిగుమతులను కుమ్మరించడంతో దేశీయ పరిశ్రమ భౌతికంగా నష్టపోయిందని డీజీటీఆర్ తన సిఫార్సుల్లో పేర్కొంది. డీజీటీఆర్ దర్యాప్తు చేపట్టి... సుంకం విధించాలని సిఫార్సు చేసిన అనంతరం వాణిజ్య శాఖ మూడు నెలల్లోపు సుంకం విధింపుపై తుది నిర్ణయం తీసుకుంటుంది. ఈ రెండు దేశాలు భారతదేశానికి కీలక భాగస్వాములుగా ఉన్నాయి. దిగుమతుల కారణంగా తక్కువ ధరలతో దేశీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయో లేదో తనిఖీ చేయడానికి కొన్ని దేశాలు యాంటీ డంపింగ్ దర్యాప్తు చేపడతాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీఓ) నిబంధనలకు అనుగుణంగా సుంకాలు విధిస్తాయి. దేశీయ పరిశ్రమకు సమాన అవకాశాలు కల్పించడానికి, చట్టబద్ధమైన వాణిజ్యాన్ని నిర్ధారించడానికి యాంటీ డంపింగ్ చర్యలు చేపడతాయి.

## ఆశా వర్కర్లకు వేతనం చెల్లించరా?

### లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుల నిలదీత

**న్యూఢిల్లీ:** ఆశా వర్కర్లకు వేతనం లేకపోవడం, సామాజిక భద్రత కల్పించాలన్న వారి డిమాండ్‌ను లోక్‌సభలో కేరళ, తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ సభ్యులు సోమవారం లేవనెత్తారు. కేంద్రం, కేరళ ప్రభుత్వం 'నిందారోపణల' నడుమ ఆరోగ్య సంరక్షణ వాలంటీర్లకు సహాయం చేయడం లేదని అన్నారు. జీరో అవర్‌లో కాంగ్రెస్‌కు చెందిన శశి థరూర్ ఈ అంశాన్ని మొదట లేవనెత్తారు. కేరళలో ఆశా వర్కర్ల నెల రోజుల ఆందోళనను ప్రస్తావిస్తూ, వారికి తక్కువ జీతం లభిస్తుందని, స్వచ్ఛంద సేవకులుగా పరిగణిస్తున్నారని, సామాజిక భద్రత, పెన్షన్ ప్రయోజనాలు నిరాకరిస్తున్నారని ఆయన తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఫ్రంట్‌లైన్ ఆరోగ్య సంరక్షణ దాతలుగా పని చేసిన వారికి క్రమం తప్పకుండా చెల్లింపులు నిరాకరిస్తున్నారని విమర్శించారు. వారు మహిళలు అయినందున వారి ప్రయత్నాలను విస్మరిస్తారా అని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేరళకు చెందిన మరో పార్టీ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ చాలా కాలంగా ఈ అంశాన్ని లేవనెత్తాలని ప్రయత్నిస్తున్నట్లు స్పీకర్‌కు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆందోళనకు వారిని నిందిస్తుండగా, కేంద్రం ఈ పరిస్థితికి రాష్ట్రాన్ని నిందిస్తోందని ఆయన అన్నారు. తమిళనాడులోని తిరువళ్లూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్‌కు చెందిన శశికాంత్ సెంథిల్, డిజిటల్ ఇండియా చొరవ 'తిరస్కరణ భారతదేశం' చొరవగా మారిందని, అనేక ప్రధాన పథకాల తర్వాత, డిజిటల్ చొరవలను సరిగ్గా అమలు చేయకపోవడం వల్ల సమగ్ర శిశు అభివృద్ధి సేవలు (ఐసీడీఎస్) తదుపరి బాధితురాలిగా మారుతుందని ఆరోపించారు. చాలా సార్లు పేదలు ముఖ గుర్తింపు, ప్రయోజనాలను పొందడానికి వన్-టైమ్ పాస్‌వర్డ్‌లను పొందడంలో బిజీగా ఉన్నాయని ఆయన తెలిపారు. కాగా, సోమవారంతో నెల రోజులు పూర్తి చేసుకున్న ఆశా వర్కర్ల ఆందోళనను, వారి దుస్థితిని ఆర్ఎస్‌పీకి చెందిన ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ కూడా లేవనెత్తారు.

## ఎన్నికల నిర్వహణ న్యాయంగా లేదు

- ఈసీపై చర్యలు తీసుకోవాలి
- టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ డిమాండ్

**న్యూఢిల్లీ:** ఎన్నికల నిర్వహణ న్యాయం లేనందున ఎన్నికల సంఘం (ఈసీ) పై చర్యలు తీసుకోవాలని లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సభ్యుడు కల్యాణ్ బెనర్జీ సోమవారం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకల అంశాన్ని ఆయన లేవనెత్తారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎన్నికల సంఘం న్యాయంగా, పారదర్శక ఎన్నికలను నిర్వహించడంలో 'విఫలమైందని' అన్నారు. దిగువ సభలో జీరో అవర్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'నకిలీ' ఓటరు కార్డులకు సంబంధించి అనేక సందర్భాలను మొదట ఎత్తి చూపారని, అయితే ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణ ఎన్నికల నిర్వహణ నియమాలనే స్పష్టంగా ఉల్లంఘించిందని తెలిపారు. 'తప్పుడు' ఓటర్ల జాబితా తీవ్రమైన ఆందోళన కలిగించే విషయమని, ఎన్నికల నిర్వహణ నియమంలోని 20వ నిబంధనను ఉల్లంఘించడమేనని టీఎంసీ సభ్యుడు అన్నారు. 'గత కొన్ని సంవత్సరాలుగా ఈ విషయాలను లేవనెత్తడం జరిగింది. గతంలో అది జరగలేదు. పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల సంఖ్య ఎక్కడ నుంచి వచ్చింది. గుజరాత్, హర్యానా నుంచి ఓటర్లు వస్తున్నారు... ఇది సహించదగినది కాదు' అని శ్రీరాంపూర్ లోక్‌సభ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ అన్నారు. 'ఎన్నికల కమిషన్ ఎప్పుడూ పారదర్శకంగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెబుతోంది. కానీ కొన్ని సంవత్సరాలుగా ఎన్నికలు పారదర్శకంగా, న్యాయంగా జరగలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఎన్నికల కమిషన్ సరైన చర్య తీసుకోలేదు. ఈ కారణంగా ఎన్నికల కమిషన్‌పై తగిన చర్యలు తీసుకోవాలి' అని టీఎంసీ నాయకుడు అన్నారు. నకిలీ ఎలక్టోరల్ ఫోటో గుర్తింపు కార్డు (ఈపీఐసీ) నంబర్ల సమస్యను తృణమూల్ కాంగ్రెస్ లేవనెత్తుతోంది. దీని తర్వాత ఎన్నికల కమిషన్ రాబోయే మూడు నెలల్లో దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. పశ్చిమ బెంగాల్‌లో ఇతర రాష్ట్రాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా ఓటర్ల జాబితాలను తారుమారు చేశారనే తృణమూల్ కాంగ్రెస్ వాదనను ఎన్నికల సంఘం తిరస్కరించింది. కొంతమంది ఓటర్ల ఎపిక్ నంబర్లు 'ఒకేలా ఉండవచ్చు' అయినప్పటికీ, జనాభా సమాచారం, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్ వంటి ఇతర వివరాలు భిన్నంగా ఉంటాయని కూడా ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

### చత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం

## బాఘెల్ కుమారుడి నివాసంపై ఈడీ దాడులు

**రాయ్‌పూర్:** మద్యం కుంభకోణానికి సంబంధించి మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాఘెల్ కుమారుడు చైతన్య బాఘెల్ నివాసం సహా చత్తీస్‌గఢ్ అంతటా 14 ప్రాంతాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహించింది. 2019-2022 మధ్య చత్తీస్‌గఢ్‌లో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, మద్యం వ్యాపారుల ముఠా సుమారు రూ.2,161 కోట్లు అక్రమంగా వసూలు చేసినట్లు ఈడీ ఆరోపించింది. రాష్ట్ర నిర్వహణ దుకాణాల ద్వారా మద్యం అమ్మకం, పంపిణీని నియంత్రించడం ద్వారా ఈ ముఠా మద్యం సరఫరా గొలుసును తారుమారు చేసిందని దర్యాప్తు సంస్థ పేర్కొంది. అమ్మిన మద్యంలో గణనీయమైన భాగాన్ని అధికారిక రికార్డులలో లెక్కించలేదని, ఈ అక్రమ అమ్మకాలను సులభతరం చేయడానికి సరఫరాదారుల నుంచి లంచాలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర మద్యం వ్యాపారంలో అక్రమాలను గుర్తించిన ఆదాయపు పన్ను శాఖ మునుపటి నివేదిక నుంచి ఈ దర్యాప్తు జరిగింది. ఈ కుంభకోణం నుంచి వచ్చిన 'నేర ఆదాయం'తో చైతన్య బాఘేల్‌కు సంబంధం ఉన్న ఆధారాలను ఈడీ కనుగొన్నట్లు తెలుస్తోంది. సోమవారం దర్యాప్తు అధికారులు చైతన్య బాఘెల్ సన్నిహితుడు అయిన వ్యాపారవేత్త లక్ష్మీ నారాయణ్ బన్సాల్ (పప్పు బన్సాల్) నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ దర్యాప్తులో ఇప్పటికే ఐఏఎస్ అధికారి అనిల్ తుటేజా, రాయ్‌పూర్ మేయర్ సోదరుడు వ్యాపారవేత్త అన్వర్ ధేబర్ ఉన్నారు. జనవరిలో ఈడీ మాజీ ఎక్సైజ్ మంత్రి కవాసి లఖ్మాను అరెస్టు చేసింది. ఈ కుంభకోణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, ప్రతి నెలా రూ.2 కోట్ల అక్రమ చెల్లింపులు స్వీకరించారని, ఈ కుంభకోణం నుంచి వచ్చే నిధులను రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు మళ్లించారని, దీనివల్ల రాష్ట్ర ఖజానాకు గణనీయమైన నష్టం ఈడీ ఆరోపించింది. దీనికి ప్రతిస్పందనగా భూపేశ్ బాఘెల్ కార్యాలయం దాడులను రాజకీయ ప్రేరేపితమని తోసిపుచ్చింది. 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో మాజీ ముఖ్యమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది : 'ఏడు సంవత్సరాలుగా నడుస్తున్న తప్పుడు కేసును కోర్టు కొట్టివేసినప్పుడు ఈడీ ఈ ఉదయం మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూపేశ్ బాఘెల్‌కు చెందిన భిలాయ్ నివాసానికి చేరుకుంది. ఈ కుట్ర ద్వారా పంజాబ్‌లో కాంగ్రెస్‌ను ఆపడానికి ఎవరైనా ప్రయత్నిస్తుంటే, వారు పొరబడినట్లే' అని తెలిపింది. 2019-2022 మధ్య చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో ఈ కుంభకోణం జరిగిందని ఈడీ ఆరోపించింది. ఇప్పటి వరకు ఈ కేసులో ప్రమేయం ఉన్న వివిధ వ్యక్తుల నుంచి రూ.205 కోట్ల కోట్ల విలువైన ఆస్తులను దర్యాప్తు సంస్థ అటాచ్ చేసింది.

### ఈడీ దాడుల కుట్ర: పవన్ ఖేరా



పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు తిరిగి ప్రారంభమైన రోజున ప్రభుత్వం ప్రతిపక్షాల నుంచి ప్రశ్నలు ఎదుర్కొంటున్న సమయంలో దానిని పక్కదారి పట్టించడానికి చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బాఘెల్ నివాసాలపై ఈడీ దాడులు 'కుట్ర' అని కాంగ్రెస్ సోమవారం మండిపడింది. విపక్షాలు అనేక అంశాలపై పార్లమెంటులో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఈ దాడులు 'కుట్ర'గా కనిపిస్తున్నాయని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. 'కాంగ్రెస్‌ను, మా నాయకులను ఎవరూ ఆపలేరని బీజేపీ అర్థం చేసుకోవాలి. మేము భయపడము... భయపడబోం' అని ఖేరా 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

### మోదీ, అమిత్‌షా పెంపుడు కుక్క ఈడీ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పెంపుడు కుక్కలా మారిందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కమ్ ఠాగూర్ విమర్శించారు. చత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, ఆయన కుమారుడు చైతన్య బఘేల్ నివాసాలపై ఈడీ దాడులు చేపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ, అమిత్‌షాకు ఈడీ పెంపుడు కుక్కగా మారిన విషయం అందరికీ తెలుసునని, వారు ఆ కుక్కను ఎక్కడికైనా పంపవచ్చని అన్నారు. భూపేష్ బఘేల్ కాంగ్రెస్‌లో బలమైన నేత అని, ఈ దాడులను ధైర్యంగా ఎదుర్కొంటారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, చత్తీస్‌గఢ్ ప్రజలు ఆయనకు మద్దతుగా నిలుస్తారని అన్నారు. అవి సృష్టించిన నకిలీ కథలతో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎప్పటికైనా అపజయం ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. చత్తీస్‌గఢ్ ప్రజల కోసం పోరాడినందుకు, సమస్యలు పరిష్కరించినందుకు బఘేల్‌ను ఈ దాడులతో బీజేపీ శిక్షిస్తోందని ఆరోపించారు.

## వ్యాన్‌ను ఢీకొన్న లారీ... 8 మంది దుర్మరణం

**భోపాల్:** వ్యాన్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఎనిమిది మంది దుర్మరణం చెందారు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సిధి-బహ్రి రహదారిపై ఉప్నీ పెట్రోల్ బంక్ సమీపంలో మైహర్ వైపు వెళ్తున్న వ్యాన్‌ను... సిధి నుంచి బహ్రి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం రేవా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దాంతో ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. మిగిలిన క్షతగాత్రులు సిధి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

# విశాలాంధ్ర హైదరాబాద్

## కేంద్రమంతి కిషన్‌రెడ్డి దుష్ప్రచారాలు మానుకోవాలి : ఎంపి చామల

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ఒక బాధ్యతగల సెంట్రల్ క్యాబినెట్ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని చూస్తుంటే మీ తోటి ఎంపీ బండి సంజయ్‌లా మాట్లాడుతూ తానల ప్రవర్తిస్తూ తన స్టైల్‌లో మాట్లాడుతూ వారి బాటలో నడుస్తున్నట్లు కనబడుతుందని ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఇండియా చాంపియన్స్ ట్రోఫీ కప్పు గెలిచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా సెలబ్రేట్ చేసుకుంటురు, అలాగే ట్యాంక్ బండ్ పై కూడా చాలామంది యువత చేరి అక్కడ విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నా విషయాన్ని మనం గమనించామన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో లా అండ్ ఆర్డర్ నీ కంట్రోల్ చేయడానికి పోలీసులు తీసుకున్నటువంటి చర్యను కిషన్‌రెడ్డి తప్పుపడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి క్రికెట్ గెలవడానికి ఇంట్రెస్ట్ లేదని దుష్ప్రచారం చేస్తున్నారని తప్పుపట్టారు. మీరు ఒక బాధ్యత గల వ్యక్తిగా ఉండి కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారాలను చేయడాన్ని తప్పు పడుతున్నామని పేర్కొన్నారు. మీరంటే మా పార్లమెంట్ సభ్యులందరికీ మాకు చాలా గౌరవం మీరు ఇలాంటి చిల్లర మల్లర రాజకీయాలు చేసి, పనికిరాని విషయాలను , వాస్తవాలు లేని మాటలు మాట్లాడటాని మేం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## జెప్టో సూపర్‌సేవర్ నూతన ప్రచారం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న శీఘ్ర వాణిజ్య వేదిక అయిన జెప్టో తన సూపర్‌సేవర్ ప్రచారాన్ని ఆవిష్కరించింది. ఇందులో సూపర్ స్టార్ ఎన్‌టీఆర్ ఈ ప్రచారం జెప్టోపై అమ్మకందారులచే నిర్వహించబడిన అజేయమైన ధరలను హైలైట్ చేస్తుందని జెప్టోలోని చీఫ్ బ్రాండ్, కల్చర్ ఆఫీసర్ చందన్ మెండిరాట్టా చెప్పారు. జూనియర్ ఎన్‌టీఆర్ తన ప్రత్యేకమైన తీవ్రత, మనోజ్ఞతను ప్రచారానికి జోడిస్తుందన్నారు. జెప్టోతో సహకరించడం ఒక జెప్టో పొదుపు ఈ ప్రచారం వేగవంతమైన స్మార్ట్ షాపింగ్ ఉత్సాహాన్ని రేకెత్తిస్తుందన్నారు. ఎన్‌టీఆర్ జూనియర్ యొక్క తీవ్రత జెప్టో యొక్క ఆత్మకు సరైన మ్యాచ్, శీఘ్ర షాపింగ్ థ్రిల్‌ను గణనీయమైన పొదుపుతో మిళితం చేస్తుందన్నారు. సూపర్‌సేవర్‌ను ప్రారంభించినందుకు, మా ప్లాట్‌ఫామ్‌లో కనిపించే ధరలను ప్రారంభించినందుకు అమ్మకందారులకు ధన్యవాదాలు తెలిపారు. టీవీ, యూట్యూబ్, మెటా, అవుట్డోర్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రసారం చేయడానికి సెట్ చేయబడిందని, ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్ సందర్భంగా, జెప్టో సూపర్‌సేవర్ ప్రచారం ఒక ముఖ్యమైన ముద్రను వదిలివేస్తుందని హామీ ఇచ్చిందని చెప్పారు.

## సత్వర ఆరోగ్య సేవలకు ప్రత్యేక యాప్

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** జలమండలి ఉద్యోగుల ఆరోగ్య సేవలకు ప్రత్యేక యాప్ రూపొందించారు. బోర్డు పరిధిలో హెల్త్ కార్డు ఉన్నవాళ్లకు ఆరోగ్య సేవల్ని మరింత సులభతరం చేసేందుకు మెడ్‌ఫ్లాష్ అనే మొబైల్ అప్లికేషన్ తయారు చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి ఈ అప్లికేషన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగులకు ఇలాంటి యాప్ తయారు చేసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ యాప్ ను అర్హులైన వారు వినియోగించాలని తెలిపారు. డివిజన్లలో ఆరోగ్య సేవలకు సంబంధించిన పనిచేసే వాళ్లకు.. ఈ యాప్ వినియోగం గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. హెల్త్ కార్డు ఉన్న ఉద్యోగులకు సత్వర ఆరోగ్య సేవలు అందించేందుకు ఈ యాప్ తీసుకొచ్చారు. ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తలెత్తినప్పుడు ఈ యాప్ ఉపయోగించి సేవల్ని పొందవచ్చు. యాప్ ద్వారా ఆ వివరాలు నమోదు చేసుకుంటే ఏజెన్సీ వాళ్లు వెంటనే స్పందించి.. ఆరోగ్య వివరాలు, మంచి వైద్యం అందించే ఆసుపత్రులను సూచిస్తారు. అవసరమైతే.. అంబులెన్స్‌ను ఇంటి దగ్గరకు పంపించే సౌకర్యాన్నీ కల్పించారు. హెల్త్ కార్డులు ఉన్న ఉద్యోగులకు ఇలాంటి క్యాష్ లెస్ సర్వీస్ అందించడం దేశంలోనే మొదటి సారి కావడం విశేషం. జలమండలిలో ఉద్యోగులు, పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్స్ దాదాపు 6685 మందికి హెల్త్ కార్డులు ఉన్నారు. వీరితో పాటు వీరి మీద ఆధారపడిన వారందరు.. దీని ద్వారా సంవత్సరానికి రూ. 3 లక్షల వరకు ఉచిత సేవలను పొందవచ్చు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్. ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ. శ్రీధర్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రావిడెన్స్ ఇండియా ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జ్యోతి బాల పాల్గొన్నారు.

## రైతుభరోసా నిధులెక్కడా?

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మూడెకరాలు ఉన్న రైతులకూ ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 44,82,265 మంది రైతుల ఖాతాలకు, రూ.58.13 లక్షల ఎకరాలకు రూ.3487.82 కోట్లు మాత్రమే విడుదల చేశారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మూడెకరాల లోపు రైతులకు ఎంతోమందికి రైతు భరోసా నిధులు విడుదల కాలేదని పేర్కొన్నారు. మార్చి 31 వరకు అందరు రైతులకు రైతుభరోసా అందిస్తామని జనవరి 26న ప్రకటించారని, రైతుభరోసా కోసం భూములు తాకట్టుపెట్టి రూ.10 వేల కోట్లు తెచ్చారని వివరించారు. కేవలం రూ.3487.82 కోట్లు మాత్రమే రైతు ఖాతాల్లో జమచేసి సాగదీస్తున్నారని విమర్శించారు. మూడెకరాల వరకు మాత్రమే రైతుభరోసా కుదించే ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఐదెకరాల వరకు రైతుభరోసా ఇస్తామని లీకులు ఇస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 1.48 కోట్ల ఎకరాల భూమికి రైతుభరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. ఇప్పటి వరకు 58.13 లక్షల ఎకరాల వరకు మాత్రమే ఇప్పటి వరకు రైతుభరోసా అందించిందని, ప్రభుత్వ ప్రకటనలకు, పథకం అమలుకు ఏమాత్రం పొంతన కుదరడం లేదన్నారు. రైతుభరోసా అమలు చేయడం చేతకాక రాష్ట్రంలో 1.20 లక్షల సర్వే నంబర్లు బ్లాక్ లిస్టులో పెట్టారని ధ్వజమెత్తారు.

## క్రిష్ణవేణిలో గ్రాండ్ పేరెంట్స్ డే సంబరాలు

**విశాలాంధ్ర, మల్కాజిగిరి :** మల్కాజిగిరిలోని స్థానిక క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు గ్రాండ్ పేరెంట్స్ డే యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ, వారి చేత వివిధ రకాల ఆటలు ఆడించి, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రాండ్ పేరెంట్స్ పాల్గొని తమ ప్రాముఖ్యతను పిల్లలకు వివరించినందుకు, తమ చిన్నతనాన్ని గుర్తు చేసినందుకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డా.మంచాల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు హారిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలకు సీట్లు ఇవ్వడం హర్షణీయం : మంత్రి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణన చేసిన సర్వే తరువాత జరిగిన శాసనసభ్యుల ద్వారా ఎంపిక అయ్యే శాసన మండలి అభ్యర్థులను బలహీన వర్గాలకు కేటాయించడం శుభసూచకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీఆర్ఎస్ ఒక బీసీ, సీపీఐకి కేటాయించిన సీటు బీసీకి కేటాయించండని ఆయన స్వాగతించారు. ఈ ఐదు స్థానాలూ పూర్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీకి ఇవ్వడం తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇదే ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని తీసుకుని రాబోయే కాలంలో 42 శాతం రిజర్వేషన్లతో పాటు అందరూ ఐక్యంగా ఉండి సామాజిక ఆర్థిక రాజకీయ అంశాల్లో ఎదగాలని కోరుతున్నానని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహచర మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు పెద విద్యార్థులు చదువుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చదువుకునే యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కోసం రూ.11 వేల కోట్లతో 55 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం సంక్షన్ చేయడం దేశ చరిత్రలో విప్లవాత్మక నిర్ణయంగా అభివర్ణించారు..ఒక విద్యార్థి నాయకుడిగా బలహీన శాఖ మంత్రిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఇది చాలా చారిత్రక నిర్ణయం అన్నారు. ఎంఎస్ ఎంఈ పరిశ్రమల ఏర్పాటు బలహీన వర్గాలు ఉపయోగించుకుని, బీసీ సబ్‌ప్లాన్ భవిష్యత్తులో బీసీలు రాజకీయంగా ఉపయోగించుకోవాలన్నారు. శాసనమండలి అభ్యర్థులుగా ఎంపికైన ఐదుగురు ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలందరికి హృదయపూర్వక అభినందనలు అని భవిష్యత్ లో బీసీలు రాజకీయాల్లోకి రావాలన్నారు.

**వేములవాడ రాజన్నను దర్శించుకున్న మంత్రి,....**

దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం జరిగింది. సర్వేజనా సుఖినోభవంతు సమృద్ధిగా వర్షాలు కురుస్తూ ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని వేడుకోవడం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు తీసుకెళ్ళాలి ఆ వేములవాడ రాజన్న ఆశీర్వాదం ఇవ్వాలని కోరారు. వేములవాడ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్లే బలాన్ని కూడా ఇవ్వాలని వేడుకున్నారు.

## సమాచారంతో సిద్ధాంగా ఉండాలి : సీఎస్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షిస్తూ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమించుకోవాలని సీఎస్ అన్నారు. వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్, దాన కిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## విద్యా నిధికి మై హోం రూ. 10 లక్షల విరాళం

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మహబూబ్ నగర్ విద్యా నిధికి రూ.10 లక్షల భారీ విరాళాన్ని మైహోం గ్రూప్స్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ చింతం, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి కలెక్టర్ చాంబర్ లో అందజేశారు. మహబూబ్ నగర్ కు చెందిన పురుషోత్తం రెడ్డి విద్యా నిధికి రూ.5 వేల చెక్కును కలెక్టర్ కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ విద్యా నిధిని ఈ సంవత్సరం జనవరిలో ప్రారంభించడం జరిగిందని, ఈ విద్యా నిధిని మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు, ప్రభుత్వ విద్యా సంస్థలో అత్యవసరమైన మౌళిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ అధికారుల ద్వారానే ఖర్చు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ లో విద్యా నిధి, దాని ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్న ప్రముఖులు మై హోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, వారి కుటుంబ సభ్యులు మహబూబ్ నగర్ విద్యా నిధికి రూ.10 లక్షల చెక్కును మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కి అందజేయడం జరిగిందన్నారు. రానున్న నాలుగు సంవత్సరాలలో పది కోట్ల రూపాయలను విద్యా నిధికి సమకూర్చేందుకు తాను ప్రయత్నం చేస్తున్నానని ఆయన చెప్పారు. ఈ యొక్క విద్యా నిధి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం ఖర్చు చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజె బెనహర్, మాజీ కౌన్సిలర్ శంకర్, ఎం.ప్రవీణ్ కుమార్, పురుషోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే వర్ధంతి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** చదువుల తల్లి సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ కార్యదర్శి కే పద్మావతి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహాతల్లి సావిత్రిబాయి పూలే త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. మహిళల అభ్యున్నతికి, స్త్రీవిద్యకు ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. ఆటంకాలు, అవమానాలు, అవహేళనలు ఎన్ని ఎదురైనా జడవక ముందుకేగి మహిళలకు చదువు చెప్పార న్నారు. మహిళా పాఠశాలలను నెలకొల్పారు. అంతేకాకుండా వితంతు వివాహాలను ప్రోత్సహించారు. మహాత్మ జ్యోతిబాపూలే అండతో ఆమె స్త్రీల కొరకు అనేక ఉద్యమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ వనపర్తి జిల్లా కార్యదర్శి కే.గీతమ్మ మహబూబ్నగర్ జిల్లా కమిటీ సభ్యులు చంద్రకళ, సింధుజ, బాలకృష్ణమ్మ, మొగులమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రం అందజేత

**విశాలాంధ్ర శేరిలింగంపల్లి :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన మాలకొండయ్యకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.2,50,000 ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘునాథ్ రెడ్డి, గురు చరణ్ దూబె,చంద్రిక ప్రసాద్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## అక్కసు వెళ్లగక్కుతున్న బీఆర్ఎస్ నేతలు : మంత్రి సీతక్క

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** మహిళలకు మేలు జరుగుతుంటే దాని చూసి ఓర్వలేని బీఆరెస్ నాయకులు కాంగ్రెస్‌పై కడుపుమంటతో తమ అక్కసును వెళ్లగక్కుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు ప్రజా ప్రభుత్వం వడ్డీలు చెల్లించడం లేదన్న మాజీ మంత్రి హరీష్ వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సభ విజయవంతమైందని అందుకే కడుపు మంటతో హరీష్ రావు అబద్ధాలు వల్లే వేస్తున్నారని మండిపడ్డారు. మీ ప్రభుత్వంలో మహిళలకు మీరేం చేయలేదని విషయం మహిళలందరికీ తెలుసన్నారు. వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు, మహిళలు అప్పుల పాలవుతున్నారు, ఆగం అవుతున్నారు అని హరీష్ రావు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని, మహిళా సంక్షేమం మీ పాలన చూచామంటూ ధ్వజమెత్తారు..మీ పాలనలో మీ ఆడబిడ్డ కవిత ఒక్కరే ఎదిగారని, బతుకమ్మ వేడుకలు అయినా, బీసీ ఉద్యమం అయినా, మహిళా ఉద్యమమైనా కవితే హైజాక్ చేస్తారని దుయ్యబట్టారు. కవిత తప్ప ఏ ఆడబిడ్డ ముందుకు రావద్దు అన్నది టిఆర్ఎస్ లక్ష్యమని, అందుకే లక్ష మంది తరలివచ్చి మహిళా సభను సక్సెస్ చేస్తే మీరు ఓర్వ లేకపోతున్నారని విమర్శించారు. మీరు ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు రూ.3485 కోట్లు చెల్లించాల్సి ఉండగా.కేవలం రూ.409 కోట్లు మాత్రమే చెల్లించారని వివరించారు. హరీష్ రావు ఆర్థిక మంత్రిగా చివరి మూడేళ్లలో మహిళా సంఘాల వడ్డీల కోసం నయా పైస చెల్లించలేదని, మహిళలకు మూడేళ్లు గుండు సున్నా పెట్టి పోయారని చెప్పారు. వేల కోట్ల వడ్డీలు చెల్లించకుండా మహిళలను మోసం చేశారని, ఆడబిడ్డలు రూపాయి రూపాయి పోగేసుకున్న అభయహస్తం డబ్బులను దిగమింగిన చరిత్ర మీదని మండిపడ్డారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళలకు పూర్తి స్థాయిలో వడ్డీలు చెల్లించామన్నారు. ఈ ఏడాదికి సంబంధించి వడ్డీలు మహిళలకు చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు భారం కాకుండా సభ్యురాలి కుటుంబం ఇబ్బందులు పడకుండా పది లక్షల రూపాయల ప్రమాద బీమా చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటికే 400 మంది మహిళలకు రూ.40 కోట్లకు పైగా చెల్లిస్తున్నామన్నారు. మహిళా సంఘాల పట్ల ఇది మా చిత్తశుద్ధి అన్నారు. మహిళల గురించి మీరు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని సూచించారు..

## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం : మహేష్ గౌడ్

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** సామాజిక న్యాయంకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్ అని మరోసారి నిరూపితం కావడం జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కులఘనన చేసినా,... ఎస్సీ వర్గీకరణ చేసినా,... పార్టీ, ప్రభుత్వ, చట్ట సభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ లకు పదవులు ఇచ్చినా అది కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అవుతుందన్నారు. మొదట వచ్చిన ఎమ్మెల్సీలలో బీసీలకు రెండు ఒక మైనార్టీకి ఇచ్చామని, తర్వాత 2 రాజ్యసభ సీట్లు వస్తే ఒక సీటు యువ బీసీ నేత అనిల్ కుమార్ యాదవ్‌కి ఇచ్చామన్నారు..ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి 4 ఎమ్మెల్సీలు అవకాశాలు వస్తే ఒక సీటు పొత్తు ధర్మంలో సీపీఐకి ఇస్తే వారు కూడా అక్కడ బీసీ అభ్యర్థికి ఇవ్వడం హర్షించదగ్గ విషయ మన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 3 వస్తే ఒక ఎస్టీ, ఒక ఎస్సీ, ఒక బీసీ మహిళకు ఇచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రిరెడ్డికి అవకాశం వస్తే పీసీసీగా నాకు ఒక బీసీ సామాజిక వర్గానికి అవకాశం ఇచ్చారని, ఏ అవకాశం వచ్చినా బీసీలకు ఎస్సీ, ఎస్టీలకు ప్రముఖ స్థానం ఇస్తూ కాంగ్రెస్ మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా కుల ఘనన చేసి 56 శాతం బీసీలు ఉన్నారని తేల్చి చెప్పామన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి తీర్మానం చేసి దేశ వ్యాప్తంగా బీసీ కులఘనన అయ్యేలా పోరాటం చేస్తామని, సామాజిక న్యాయానికి తెలంగాణ ప్రభుత్వం రోల్ మాడల్‌గా ఉంటుందన్నారు.

## సావిత్రిబాయి పూలే త్యాగాలు కరదీపికలు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** సంఘసంస్కర్త, అబలల ఆదిశక్తి, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అశేష త్యాగాలు నేటి మహిళా చైతన్యకరదీపికలని సామాజిక చైతన్య గీతాల ప్రముఖ గాయని కవయిత్రి శ్యామల కొనియాడారు. సోమవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే త్యాగాలు పోరాట ఘట్టాలు ఆమె అవమానాలు వర్ణిస్తూ స్వీయ రచన గానంతో శ్యామల పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్యామల మాట్లాడుతూ సావిత్రి బాయిని మహనీయుడు జ్యోతిరావు పూలేకి తొమ్మిదేళ్ల ఏటలోనే పెళ్లి చేశారని అన్నారు. ఆనాడు మహిళలు అనేక అమానవీయ కట్టుబాట్లలో బందీ అయిన మహిళోద్ధరణ కోసం జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలేకి అక్షర ఓనమాలు నేర్పారని అదే స్ఫూర్తితో సావిత్రిబాయి పూలే మహిళలకు చదువు ఆవశ్యకతను చాటుతూ అనేక అవమానాలు దాడులు దౌర్జన్యాలు ఎదుర్కొని బాలికలకు బడి తలుపులు తెరిచిన గొప్ప త్యాగధనురాలని కొనియాడారు. మహిళా వికాసానికి, మహిళా సామాజిక అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే వేసిన విద్యా బీజాలే పునాదిరాలని అన్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహాలను చట్టసభల భవనాల్లో నిర్మించాలని, సావిత్రిబాయి పూలే మహిళా విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ బ్రాంచ్ నేతలు కార్మికులు పద్మ, సత్యమ్మ, వరలక్ష్మి, ఇందిరా, జ్యోతి, సత్యమ్మ, వెంకటమ్మ, అంజమ్మ,అరుణ, లక్ష్మి, తిరుపతమ్మ, మంజుల, నాగమ్మ,యాదమ్మ, చెన్నమ్మ, జంగమ్మ, అంజిలమ్మ, బి.చెన్నయ్య,గోపాల్ నాయక్, మొగులయ్య, బుచ్చన్న, బాలకోటి, దేవానంద్, రాఘవేందర్, అంజి, యాదయ్య, నరేష్, యుగంధర్ రెడ్డి, శంకర్, మహేష్, అంజిలయ్య, మున్నా, మన్యం, రవి గోపాల్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోటేశ్వర్ రెడ్డి, గోపాల్ నాయక్, సతీష్ రెడ్డి, కర్ణాకర్, మురళి పాల్గొన్నారు.

## మహిళా స్వాలంభనే ప్రభుత్వ లక్ష్యం: మేయర్ గద్వాల్

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** మహిళలు ఆర్థికంగా స్వాలంభన సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ ఏర్పాటు చేసుకున్న స్నేహిత సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మహిళలను వ్యాపారవేత్తలు గా రాణించేలా ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఆసక్తి గల స్వయం సహాయక సంఘాల మహిళలచే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేలా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారితను ప్రోత్సహిస్తూ స్వయం ఉపాధికి ఊతం ఇచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఈ క్యాంటీన్ల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా నగర ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం, భోజనం అందుబాటులోకి వస్తుందన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలందరూ వినియోగించుకొని తమ నైపుణ్యత, ఆసక్తి మేరకు రాణించాలన్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్ కు చెందిన స్నేహిత స్వయం సహాయక సంఘానికి చెందిన ఐదు మంది మహిళలు రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఈ క్యాంటీన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యు.సి.డి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, డి.సి ప్రశాంతి, అమీర్పేట్ ఎస్.బి.ఐ బ్రాంచ్ మేనేజర్, డి.పి.ఓ ఆశ, స్నేహిత స్వయం సహాయక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కమిషనర్

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కారం కై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయరాదని, ఎప్పటికప్పుడు పరిష్కరించడ పై దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులకు ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 79 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 49, ట్యాక్స్ సెక్షన్ 12, ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు మూడు చొప్పున, యు.సి.డి, హెల్త్, ఫైనాన్స్ విభాగాలకు రెండు చొప్పున, జోనల్ ఆఫీస్ (కూకట్ పల్లి), శానిటేషన్, ఎలక్ట్రికల్, లేక్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా రెండు ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 108 అర్జీలు అందగా, అందులో కూకట్ పల్లి జోన్ లో 56, సికింద్రాబాద్ జోన్ లో 13, శేరిలింగంపల్లి జోన్ లో 18, చార్మినార్, ఎల్బీనగర్ జోన్ లలో 10 చొప్పున, ఖైరతాబాద్ జోన్ లో ఒక్క ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సీపీ పి శ్రీనివాస్, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, యు.బి.డి డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్, అడిషనల్ సి.సి.పి గంగాధర్, జోనల్ సిపి లు, ఎస్టేట్ అధికారి ఉమా ప్రకాష్, డిప్యూటీ సీఈ పనస రెడ్డి, హౌసింగ్ ఈఈ లు పీవీ రమణ, రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధికి కృషి

**విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:** కాలనీల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట పరిధి మైసమ్మ నగర్ బి -బ్లాక్ కమిటీ సభ్యుడిగా అధ్యక్షులు బస్వప్ప, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, కోశాధి కారి శ్రీకాంత్ యాదవ్, వెంకటేష్, సంతోష్, రాములు, సాయి ,ప్రేమ్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడు అండగా ఉంటానని వెల్లడించారు. అనంతరం కొలను హన్మంత్ రెడ్డి నూతన కమిటీ సభ్యులని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వేణు గౌడ్, బుచ్చి రెడ్డి పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగది ద్వంద వైఖరి :రవి

**విశాలాంధ్ర - బషీర్ బాగ్ :** మందకృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్రంలో ఒకలా ఆంధ్రప్రదేశ్‌లో మారుకలా ద్వంద వైఖరితో ఉన్నాడని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. సోమవారం ఆంధ్ర, తెలంగాణ మాదిగ సంఘాల సంయుక్త సమావేశం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మాదిగ జేసి వ్యవస్థాపకులు పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల వారీగా వర్గీకరణ అంటే కనీసం ఒక్కరోజు స్పందించలేదన్నారు. ఇక్కడ మౌనంగా ఉండి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలి అని కొత్త డిమాండ్‌తో ముందుకు వెళ్తున్నాడనీ, తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు ఎంత శాతం రిజర్వేషన్ అనకుండా మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ఏబిసిడి వర్గీకరణ చేయాలి అని మాదిగలకు అన్యాయం చేయబోతున్నాడని అన్నారు. మందకృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్ లో ఏడు శాతం రిజర్వేషన్ మాదిగలకు ఇవ్వాలని డిమాండ్ చేయాలని అన్నారు. అక్కడున్న మాదిగలకు అన్యాయం చేయకుండా ఆంధ్రప్రదేశ్ లో మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ఎమ్మార్పీఎస్ వియోగస్థాపక అధ్యక్షులు కృపాకర్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వల్ల తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లో మాదిగలు నష్టపోతున్నారని, మందకృష్ణ మాదిగ మోసపూరితమైన మాదిగ ఉద్యమం చేస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పేర పోగు వెంకటేశ్వరరావు, దండు వీరయ్య, మేరీ మాదిగ, సతీష్ మాదిగ, రాయి కంటి రాందాస్, బూదాల బాబు రావు, డాక్టర్ మీసాల మల్లేశం,డాక్టర్ నంద్రు నరసింహారావు, బోరెల్లి సురేష్, బోయిని ఎల్లేష్, నక్క మహేష్, దేవరకొండ నరేష్, జోకు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు లయన్స్ క్లబ్ సేవలు

**ఆమనగల్లు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులు దోమ మోహన్‌రెడ్డి సహకారంతో రూ.30 వేల విలువగల బోరు మోటర్‌ను క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభింపజేశారు. వేసవికాలం సమీపిస్తున్న దృశ్య తలకొండపల్లి మండలంలోని సడక్ తాండ గిరిజనులు నీటి ఎద్దడి ఏర్పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. నీటి ఎద్దడి నివారణకు లయన్స్ సభ్యులు దోమ మోహన్ రెడ్డి స్పందించి బోరు మోటర్‌ను ఇప్పించి నీటి ఎద్దడి తీర్చిన లయన్ సభ్యులు మోహన్ రెడ్డికి క్లబ్ అధ్యక్షులు పసుల లక్ష్మారెడ్డి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమా లను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ కందే ఓంకారం, లయన్ మధుసూదన్ రెడ్డి, లయన్స్ క్లబ్ పి ఆర్ ఓ ఎంఏ పాషా, తండావాసులు దేవుళ నాయక్, దేశ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి మహిళల సేవలు అమూల్యం

**విశాలాంధ్ర శేరిలింగంపల్లి :** చందానగర్‌లోని గంగారంలోని మహిళా దక్షత సమితి విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు సమాజానికి చేస్తున్న అమూల్యమైన సేవలకు గుర్తుగా నాయకులు, దాతలు, విద్యావేత్తలతో కూడిన విశిష్ట సమ్మేళనాన్ని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా దక్షత సమితి విద్యా సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా విద్య ద్వారా మహిళల సాధికారతకు అంకితమైన మహిళా దక్షత సమితి దీర్ఘకాలిక కృషిని వివరించారు. అనాథలు, ఒంటరి తల్లిదండ్రుల కుమార్తెలు, దినసరి కూలీల పిల్లలతో సహా వెనుకబడిన నేపథ్యాలకు చెందిన బాలికలకు అవకాశాలను అందించడానికి సంస్థ నిబద్ధతను ఆమె నొక్కి చెప్పారు. మహిళా దక్షత సమితి ఆధ్వర్యంలోని సంస్థలు వేలాది మంది యువతులకు విద్య, హాస్టల్ సౌకర్యాలు, పోషణ వాతావరణాన్ని కల్పించాయి. అంతేకాక, డాక్టర్ బజాజ్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి ఉద్వేగభరితంగా మాట్లాడారు. ప్రపంచాన్ని రూపొందించడంలో మహిళలు పోషించే కీలక పాత్రను నొక్కిచెబుతూ ప్రముఖ రచయిత్రి హ్యారియెట్ బీచర్ స్టోవ్ మహిళలే సమాజానికి నిజమైన రూపకర్తలు అని పేర్కొనడాన్ని ఆమె ఉటంకించారు. సుమన్ నిలయం హాస్టల్, రాబోయే నిర్మలా గోయెంకా హాస్టల్ వంటి సౌకర్యాలను కల్పించి, విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడానికి సహకరించిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. స్పీకర్ గా ఉషా గోపాలరత్నం మాట్లాడుతూ, బిజినెస్, కన్సల్టింగ్‌లో గొప్ప నేపథ్యం ఉన్న ఉష గారు ఎంటర్ ప్రెన్యూర్ షిప్, లీడర్ షిప్ లో మహిళల కీలక పాత్ర గురించి మాట్లాడారు.

# ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు : మంత్రులు

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన సాగునీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు పలు అంశాలు చర్చించారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, ఏఎం ఆర్పీలో ఐదవ పంపు ఏర్పాటు చేసుకునే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పూర్తిగా స్టడీ చేసి గోదావరి నీటితో పాలేరు రిజర్వాయర్‌ను పరిపుష్టం చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరిధిలో బస్వాపూర్ మొదలు సింగూరు వరకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏదుల నుంచి వట్టెం - ఏదుల కాలువలు గుర్తు చేసుకోవాలని ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న భూ సేకరణ, పాత ప్రాజెక్టుల నిర్వహణ, క్యాపిటల్ వర్క్స్ పై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునికరించుకోవడం, కాలువలకు లైనింగ్ ద్వారా ప్రాజెక్టుల జీవితకాలం పెరుగుతుందని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. గత పది సంవత్సరాల పాటు పరిపాలించిన వారు కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి, రాష్ట్రంలో ఉన్న పాత ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని గాలికి వదిలేయడంతో అవి ప్రమాదంలో పడే పరిస్థితి ఎదురైందని వివరించారు. పాత ప్రాజెక్టులను కాపాడుకునేందుకు మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూనే, కేంద్ర నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు రాబట్టేందుకు ఉన్న అవకాశాలను త్వరితగతిన పరిశీలించాలని మంత్రులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక లీగల్ టీం ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టుల గేట్ల పరమతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువలను బలోపేతం చేసుకునే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు అడ్డగోలుగా ఎక్కువ వడ్డీ రేట్లు కు అప్పులు తేవడంతో ఆ భారం ప్రస్తుత ఖజానా నిర్వహణపై పడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు 10శాతం వడ్డీ రేటుకు అప్పులు తేగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వడ్డీ రేట్లు 8 శాతానికి తగ్గించేందుకు అధికారులు మంచి ప్రయత్నం చేశారని మంత్రులు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఈ పథకం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈఎన్సీ జనరల్ అనిల్, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, ఓ అండ్ ఎం ఈఎన్సీ.విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులను ఎంపిక చేయాలి: మంత్రి పొంగులేటి

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** జనవరి మూడవ వారంలో నిర్వహించిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ స్పెషల్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపి గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనవరి 26వ తేదీన మోడల్ ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను ఎంపిక చేసిన 562 గ్రామాల్లో ఎదురైన పరిస్థితులు, మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని ఇప్పటివరకు ఎదురైన సమస్యలను అంచనావేసి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అర్హతగల లబ్దిదారులను గుర్తించడంలో పకడ్బందీగా వ్యవహరించాలి. వీలైనంత మేరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నాకూడా అనర్హులని తేలితే వాటిని రద్దుచేస్తామని ప్రకటించారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసిన సమయంలోనే వారి అర్హతలను నిర్ధారించగలగాలి, దీనివలన సమయంతోపాటు అర్హులకు న్యాయం జరుగుతుంది. అర్హతలేని వారు లబ్దిదారుల జాబితాలో చేరకుండా ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హులై, ఇండ్లు పొందలేదని ఫిర్యాదులు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని, ఇండ్ల మంజూరులో నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. వారి ఆశలకు అనుగుణంగా అధికారులు పనిచేసి అత్యంత నిరుపేదలను ఎంపిక చేసి పారదర్శకంగా జాబితాను తయారు చేయాలని, ఏదశలోనూ అనర్హులకు మంజూరు చేశామన్న మాటే రాకూడదన్నారు.

## అప్పులు తెచ్చి బడా కాంట్రాక్టర్లకు పంపిణీ : కవిత

**విశాలాంధ్ర - హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి బడా కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. 15 నెలల పాలనలో రేవంత్ రెడ్డి సర్కారు రూ. లక్షా 52 వేలకుపైగా అప్పులు చేసిందని ఎండగట్టారు. కానీ పేద ప్రజలకు ఒక్క మంచి పనీ చేయలేదని, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, మరి ఈ డబ్బులన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అప్పులు, ఖర్చులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ గొప్పగా, ఉన్నతంగా ఉందంటూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పదేళ్లలో కేసీఆర్ చాటిచెప్పి పెట్టుబడులను ఆహ్వానిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాష్ట్ర పరిస్థితి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగలేదని అబద్దాలు చెబుతున్నారని, ఇలాంటి వ్యక్తి మన రాష్ట్రానికి రెడ్డి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టకరమని మండిపడ్డారు. దీంతో దేశంలో ఉన్న అన్ని పత్రికలు కూడా తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో ఉందని రాశాయని, ఇది బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్ల, ప్రజల పట్ల రేవంత్ రెడ్డికి గౌరవం లేదని విరుచుకుపడ్డారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కనీసం రూ 500 కోట్లు కూడా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టడానికి (మూలధన వ్యయం) ఖర్చు చేయలేకపోతున్నామని, రాష్ట్రానికి రూ 5500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం రావడం లేదని అని అబద్దాలు చెప్పారని గుర్తు చేశారు. కానీ రాష్ట్రానికి నెలకు రూ 18 వేల కోట్లు వస్తున్నాయని, రూ 6 వేల కోట్లు ఖర్చవుతున్నాయని, దాదాపు రూ 12 వేల కోట్లు రాష్ట్రానికి మిగులుతున్నాయని వెల్లడించారు. సగటున దాదాపు రూ 3 వేల కోట్లు మూలధన వ్యయంగా ఖర్చు చేస్తున్నారని, కానీ ముఖ్యమంత్రి మాత్రం అందుకు విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత పెద్దవాళ్లపై ఉందని, పేద వాళ్లపై లేదని విమర్శించారు. 2023 నవంబరు నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్షా 50 వేల కోట్లు అప్పు చేసిందని, అంటే సగటున నెలకు రూ 10 వేల కోట్లు అప్పు తెస్తున్నారని, మరి ఈ డబ్బులన్నీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడం లేదు, రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకం సంపూర్ణంగా అమలు కాలేదు, వరికి బోనస్ బోగస్ అయింది. ఈ డబ్బులు ఎక్కడికి పోతున్నాయని నిలదీశారు.

## మహిళా పథకాలపై ఆర్భాటం తప్పా సమీక్ష లేదు : సుధారాణి

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్ నగర్‌లో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. బడ్జెట్ కేటాయింపులో మహిళల వాటా ఎంతా ' రౌండ్ టేబుల్ సమావేశం ఎన్ఎఫ్ఐడబ్ల్యు హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి హాజరు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పాలకులు మహిళల కోసం అనేక స్కీములు, సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. బడ్జెట్ సమావేశాలలో కేటాయింపులు చేసి వాటిపైన ఏ రకమైనటువంటి సమీక్ష నిర్వహించకపోవడం జవాబుదారితనం లేకపోవడం వలన మహిళలు నష్టపోతున్నారు. ప్రపంచంలో మొదటిసారిగా ఆస్ట్రేలియా 1984 జెండర్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి నూతన వరవడిని సృష్టించడం జరిగింది. ఇప్పుడు స్వీడన్ ప్రవేశపెట్టిన జెండర్ బడ్జెట్ లో పథకాలకు సంబంధించి కేటాయింపులు,ఖర్చులు, సమీక్ష సమావేశాలు నిర్వహించి అద్భుతమైన ఫలితాలు సాధిస్తూ ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నదని తెలిపారు. మనదేశంలో 49 మంత్రిత్వ శాఖలు ఉంటే కేవలము 5 శాఖలు మాత్రమే ఆయా రంగాలలో కేటాయించిన బడ్జెట్ వివరాలు ,మహిళా ఉద్యోగులకు సంబంధించి అదేవిధంగా మహిళా సంబందించిన పథకాల గురించి రిపోర్ట్ తయారు చేసుకున్నారు. తప్ప మిగతా డిపార్ట్మెంట్ లు ఏవి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం భేటీ పడావో బేటి బచావో పథకం ద్వారా కేటాయించిన బడ్జెట్ లో 70 శాతం నిధులు ప్రచారానికి ఖర్చు పెట్టారన్నారు. గ్రామీణ ప్రాంతంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడం మూలంగా కోట్లాదిమంది ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. ఐక్యరాజ్యసమితి ఐదు శాతం జీడీపీలో ఆయా దేశాలు ఖర్చు చేయాలని ఆదేశాలున్నప్పటికిని మన ప్రభుత్వం కేవలం ఒక్క శాతం మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు.

**మహిళలు పిల్లలను కనే యంత్రాలు కాదు : రజనీ**

మత, ప్రాంతీయ రాజకీయాల కోసం ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు జనాభాను పెంచుకోవాలని దానికి మహిళలు పెద్ద సంఖ్యలో పిల్లల్ని కనాలని మాట్లాడటం బాధ్యతారాహిత్యం. సమస్యలకు పరిష్కారం వెతకలేని పాలకులు ఇటువంటి ప్రకటనలు ఇవ్వడం దారుణమని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ఉపాధ్యక్షురాలు రజనీ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళాపురం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ పావని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎన్ జ్యోతి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నళిని రాష్ట్ర సహాయ కార్యదర్శి ఫైమిద, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు హైమావతి, అరుణ కళమ్మ , చందన,సుజాత, విజయ లక్ష్మి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ మార్పుకు ప్రయత్నిద్దాం

**విశాలాంధ్ర, హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే అంతర్జాతీయ మహిళా దినోత్సవం -2025ను సోమవారం రైల్ నిలయంలోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, పద్మశ్రీ, సునీత కృష్ణన్ మాట్లాడుతూ, మహిళా సాధికారతను మరింత బలోపేతం చేయడానికి ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనం ఇంకెంత దూరం వెళ్లాలో అంచనా వేయడానికి మహిళా దినోత్సవం ఒక సందర్భమని అన్నారు. మీరు ప్రపంచంలో చూడాలనుకునే మార్పుకు అనుగుణంగా ముందు మీరూ మారండి, మరియు నేను మొదటగా మారతాను అటువిమ్మట సమాజం మార్పుకై ప్రయత్నిస్తానని అని ప్రతి ఒక్కరూ వాగ్దానం చేయాలని విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వేకు మహిళా ఉద్యోగులు నిజమైన గర్వకారణమని , వారు అన్నిరంగాలలోనూ నిజాయితీ, అంకితభావంతో రాణిస్తున్నారని జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో 7,650 మందికి పైగా మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఇది మొత్తం శ్రామిక శక్తిలో దాదాపు 10% అని ఆయన పేర్కొన్నారు. పని ప్రదేశాలలో మహిళా సహోద్యోగి సురక్షితంగా , సంతోషంగా ఉండేలా చూడటం ప్రతి ఉద్యోగి బాధ్యత అని ఆయన అన్నారు. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజా రామ్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌లను అభినందించారు. దేశానికి మరియు దక్షిణ మధ్య రైల్వేకు వన్నె తెచ్చిన మహిళా క్రీడాకారుల కృషికి ఆయన వారిని కూడా అభినందించారు. ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ సిద్ధార్థ్ కటి నారీ శక్తి ( మహిళా ఉద్యోగులు) యొక్క అద్భుతమైన విజయాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ శ్రీ నీరజ్ అగ్రవాల్, సామాజిక కార్యకర్త, ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ, సునీతా కృష్ణన్ విశిష్ట అతిథిగా, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి గౌరవ అతిథిగా, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సి- మెట్ వ్యవస్థాపక దినోత్సవం

**విశాలాంధ్ర కాప్రా :** చర్లపల్లి పరిశ్రామికవాడలోని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ, మంత్రిత్వ శాఖ పరిశోధన సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సి- మెట్ ) 35వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎంఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ బాలమురళికిషన్, బ్రహ్మోస్ ఎయిరో స్పేస్ సీఈవోడాక్టర్ ఏ సివాంతు పిల్లా, కోఆర్డినేటర్ సునీత వర్మ, సిమెట్ డైరెక్టర్ జనరల్ విశిష్ట ఇ మాగేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బాల ముర ళీకృష్ణ మాట్లాడుతూ అగ్ర దేశాలకు దీటుగా భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుత పురోగతి సాధిస్తుందని చెప్పారు. సి మెట్ చేసిన హంపియన్ స్పాంజ్ పదార్థము రాకెట్ నాజిల్ తయారీకి ఎంతగానో ఉపయోగపడుతుంది దేశంలో ఈ లోహాన్ని తయారుచేసిన ఘనత సి మెట్‌కు దక్కింద అన్నారు. బ్యాటరీ పదార్థాలు, గ్రాఫిక్, పరిశుభ్ర లోహాలు ఎంతగానో ఉపయోగకరమైనది అని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగంలో వాడుతున్న లోహాలు ఖనిజాలు ఎలక్ట్రానిక్స్ పరికరాలలో సెమీ కండక్టర్ల ఉపయోగం వాటి తయారీ మొదలైన అంశాలపై అనేక సూచనలు చేశారు. అనంతరం శివాంతు పిల్లాయి మాట్లాడుతూ వనరుల సామర్థ్యం కాలుష్యాన్ని తగ్గించడం విలువైన కుదరదాల పునరుద్ధరణ, ప్రమాదాలను తగ్గించడంలో ఇ- వేస్ట్ మేనేజ్మెంట్ పట్ల వృత్తికార ఆర్థిక విధానం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఉన్నారు. రీసైక్లింగ్ టెక్నాలజీ పరిశ్రామిక వేతలకు బదలాయిస్తున్న సి మెట్ శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ మగేష్ మాట్లాడుతూ సి మెట్ వ్యర్థ ఎలక్ట్రానిక్ వస్తువులను రీసైక్లింగ్ చేసి బంగారం, వెండి పల్లడియన్ వంటి లోహాలను తయారు చేసిందని గుత్తివంతమైన అయ స్కాంతాలు అభివృద్ధికై అరుదైన ముడ్డి పదార్థాల అభివృద్ధిపై సిమెంట్ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని, సునీత వర్మ మాట్లాడుతూ భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ మరియు మంత్రిత్వ శాఖ యొక్క మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా అంశాలపై ప్రసంగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ రతీష్, ఎస్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంత కుమారి దూబేకి సత్కారం

**విశాలాంధ్ర శేరిలింగంపల్లి :** లక్ష్మీ విహార్ కాలనీలో శాంత కుమారి దూబేకి స్టానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ సత్కరించారు. 37 సంవత్సరములుగా ఆదర్శ ఉపాధ్యాయురాలుగా పని చేసి కొన్ని వెలమంది విద్యార్థుల బవిష్యతును తీర్చిదిద్ది, ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు అర్థిక సహకారమందించి ఉన్నత చదువులకు వెళ్ళే విధంగ ప్రోత్సాహించి వారి ఆదరాభిమానాలకు పాత్రులైనారు. ఎన్నో గౌరవ పురస్కారాలను, సన్మానాలను అందుకోని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులిగా అవార్డునందుకున్నారు. శాంత కుమారి దూబే మరియు శ్రీ రవీంద్ర ప్రసాద్ దూబే 37 వ వివాహ వార్షికోత్సవం సన్దర్భంగా దంపతులను ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర యాదవ్ పూలదండలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికీ ఎమ్మెల్యే గాంధీతో పాటు కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్ , రాగం నాగేందర్ యాదవ్ , నాయకులు రఘునాథ్ రెడ్డి,కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి,గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్స్ నెక్స్ ఫర్ వాట్స్ నెక్స్ క్యాంపెయిన్ ప్రారంభం

**విశాలాంధ్ర శేరిలింగంపల్లి :** ఆధునిక యువతే లక్ష్యంగా పురుషుల ఇన్నర్‌వేర్ బ్రాండ్ ఫోర్స్, నెక్స్ ఫర్ వాట్స్, నెక్స్ క్యాంపెయిన్ ప్రారంభించింది. డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో పురుషుల ఇన్నర్‌వేర్ బ్రాండ్ ఫోర్స్ నెక్స్ ఇది ఆధునిక పురుషుల లోదుస్తులు, క్రీడా దుస్తులు, వ్యాయామ దుస్తులకు ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ గుప్తా తెలిపారు. ఈ క్యాంపెయిన్ ద్వారా ఇన్నర్‌వేర్, అథ్లిటిక్ వేర్, యాక్టివ్‌వేర్ దుస్తులను కొత్త కోణంలో చూపించనున్నామన్నారు. తాజా టెలివిజన్ యాడ్ ద్వారా ఇవి అవసరం మాత్రమే కాకుండా వ్యక్తిగత శైలిని, ఆత్మవిశ్వాసాన్ని, స్వీయ వ్యక్తీకరణను సూచించే విధంగా ఉంటుందని తెలిపారు. ప్రసిద్ధ చలన చిత్ర దర్శకుడు ఉజేర్ ఖాన్ రూపొందించిన ఈ యాడ్ ఆధునిక జీవనశైలిని ప్రతిబింబించనుందన్నారు. ఈ యాడ్లో ఫోర్స్ నెక్స్ పరిధిని ఒక సాధారణ అవసరంగా కాకుండా.. వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే స్టైలిష్ ఎలిమెంట్‌గా చూపించారన్నారు. ఈ యాడ్లో కథానాయకుడు అనూహ్య సందర్భాల్లో తన ఫోర్స్ నెక్స్ దుస్తులను గర్వంగా ప్రదర్శిస్తూ, సాధారణ సందర్భాలను ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా మార్చడాన్ని చూపించారన్నారు. ఆధునిక యువత జీవితాల్లో వీటి పాత్రను కొత్త కోణంలో పునర్నిర్వచించిందన్నారు. శక్తివంతమైన దృశ్యాలలో రూపొందించిన ఈ యాడ్ ఆత్మవిశ్వాసంతో, ఫ్యాషన్‌పై అవగాహన ఉన్న యువకుడు వివిధ సందర్భాల్లో మహిళలతో సునాయాసంగా మమేకమవుతాడని తెలిపారు. డిజిటల్, సోషల్ మీడియా, ప్రింట్, టెలివిజన్ వేదికలో విడుదల చేశామన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

**విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ :** న్యూ నాగోల్‌లోని ఎస్. ఏ దాంగే భవన్ లో బీసీ హక్కుల సాధన సమితి నాగోల్ డివిజన్ ఆధ్వర్యంలో ఉడతల మల్లేష్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సమాజంలోని అనగాగారిని వర్గాల, అట్టడుగు వర్గాల స్త్రీలకు విద్యను అందించడానికి అనేక త్యాగాలను చేసినటువంటి మహిళా మూర్తి, సామాజిక విప్లవకార్ని సావిత్రిబాయి పూలే 148వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె యొక్క ఆశయాలను ఆలోచనలను అమలు చేయడానికి సమాజంలో, నేటికీ వెనుకబడినటువంటి, అట్టడుగు వర్గాలు, నిమ్మన జాతులు, సాంఘిక వివక్షతకు గురి అవుతున్న వర్గాలు విద్య, ఉపాధి, వైద్యానికి, దూరంగా ఉన్నారని, వాటి పరిష్కారం కోసం నేటి పాలకులు పెట్టుబడిదారీ పోకడలతో తూతూ మంత్రంగా పథకాలు బడ్జెట్లో కేటాయించి అశ్రద్ధ వహిస్తున్నారని ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో జయ, జగన్ యాదవ్, సంగు సైదారావు, చెరుకు ఈశ్వర్ గౌడ్, ఈ.కరుణాకర్, పి.శివకుమార్, జైనుల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రీ బాయి పూలే వర్ధంతి

**విశాలాంధ్ర-మల్కాజిగిరి :** సావిత్రీ బాయి పూలే వర్ధంతి సందర్భంగా గౌతమ్ నగర్ కాంగ్రెస్ నాయకులు శేఖర్, రాజు, చక్రవర్తి, దాస్, మణి, డ్వాక్రా సంఘాల రిసోర్స్ పర్సన్స్ ఇందిరా ప్రియదర్శిని, భవాని, అశ్విని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ సావిత్రీ భాయ్ పూలే మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు.

# ఇళ్ల స్థలాల కోసం సీపీఐ ఆందోళన

**రూ.10 వేల కోట్లు కేటాయించాలి: రామకృష్ణ**

విశాలాంధ్ర-విశాఖ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరుతూ సీపీఐ విశాఖ జిల్లా సమితి అధ్వర్యంలో పెద్దసంఖ్యలో పేదలు విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం తహసీల్దార్ పాల్ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా హామీల అమలుకు చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన సెంటు స్థలం సరిపోదని, పేదలు గౌరవప్రదంగా బతికేందుకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలు విశ్వసించి కూటమికి భారీ మెజారిటీతో అధికారం కట్టబెట్టారన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, తాము రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. విశాఖలోని రుషికొండపై గత ప్రభుత్వం రు.450 కోట్లతో నిర్మించిన భారీ భవనంలో బాత్‌టబ్ విలువ రూ.25 లక్షలని ప్రచారం జరిగిందని, కానీ పేదల ఇంటి నిర్మాణానికి కేవలం ఐదు లక్షలు మాత్రమే ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి పేదలకు సీపీఐ అండగా ఉంటుందని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.22 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో ఇళ్ల స్థలాల కోసం నిధులు కేటాయించలేదని, దీనికి కనీసం 10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో పేదలను సమీకరించి పోరాటం చేస్తామని రామకృష్ణ హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారులు రూ.25 వేలు, రూ.50 వేలు, లక్ష చొప్పున చెల్లించారని, ఆ ఇళ్లు పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే టిడ్కో ఇళ్లను పెద్ద ఎత్తున చేపట్టారని, వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని, వాటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్లకు, కలెక్టర్లకు దరఖాస్తులు అందజేస్తున్నామని రామకృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లాలో 5 వేల మంది పేదలు దరఖాస్తులు అందజేశారన్నారు. రైతులకు ఆర్థిక సహాయం, తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.15 వందలు తదితర హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రచార ఆర్భాటంతో 33 లక్షలు మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెబుతున్నా... నివాసాలకు 50 కిలోమీటర్లు దూరంగా వర్షం పడితే కొట్టుకుపోయే లోతట్టు ప్రాంతాల్లో ఎందుకూ పనికిరాని స్థలాలు ఇచ్చారని, వీటినే చాలా గొప్పగా చెప్పుకున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పట్టణాలలో రెండు సెంట్లు ఇస్తామని చెప్పిందని, ఊరికి దూరంగా గ్రామాలైతే వారికి మూడు సెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ పేదలకు ఇవ్వడానికి భూములు లేవని చెబుతున్నారని, వేల ఎకరాల భూములు కబ్జాదారుల కోరల్లో ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, షేక్ రెహమాన్, జీఎస్‌జే అచ్యుతరావు, పార్టీ ఏరియా కార్యదర్శులు వి.సత్యనారాయణ, కె.లక్ష్మణరావు, ఎంఏ బేగం, బి.పుష్పలత, వి.లక్ష్మి, సీహెచ్ కాసుబాబు, ఎ.రవి, బి.చిరంజీవి, ఎన్.త్రినాథ్, ఏఐటీయూసీ నాయకుడు జేడీ నాయుడుతో పాటు ఇళ్లు లేని పేదలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అజయ్‌భవన్‌కు రష్యా కమ్యూనిస్టు నేతల రాక

న్యూఢిల్లీ: సీపీఆర్ఎఫ్ కేంద్ర కమిటీ సభ్యుడు, మాస్కో సిటీ డ్యూమాలో కమ్యూనిస్ట్ పార్టీ విభాగం అధిపతి జుబ్రిలిన్ నికోలాయ్, మాస్కో సిటీ డ్యూమా కమ్యూనిస్టు పార్టీ విభాగం (స్టాఫ్) అధిపతి టిమోఖోవ్ సెర్గీ నేతృత్వంలోని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ రష్యన్ ఫెడరేషన్ (సీపీఆర్ఎఫ్) ప్రతినిధి బృందం సోమవారం దిల్లీలోని సీపీఐ ప్రధాన కార్యాలయం అజయ్‌భవన్‌ను సందర్శించింది. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు పల్లవ్‌సేన్‌గుప్తా , రామ కృష్ణ పాండాలను సీపీఆర్ఎఫ్ కలిసింది. ఇరు దేశాల పార్టీ నాయకులు వివిధ అంతర్జాతీయ సమస్యలు, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిసు ఉద్యమాలపై చర్చించారు.

## టీమిండియాకు నారాయణ అభినందనలు

హైదరాబాద్: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతలకు సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లోనూ టీమిండియా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి, ఆటగాళ్ల ప్రోత్సాహానికి దక్షిణ అమెరికా దేశాలు అనుసరిస్తున్న విధానాలు అధ్యయనం చేసి... భారతదేశంలోనూ అలాంటి వాతావరణాన్ని రూపొందించుకోవాలని నారాయణ సూచించారు. ఆటగాళ్లను చిన్నప్పటి నుంచే ప్రోత్సహిస్తూ... మెరుగైన సదుపాయాలు అందిస్తూ... అంతర్జాతీయస్థాయిలో ప్రభావం చూపేలా చేయడం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు.

## రాజధానిలో 13 సంస్థలకు భూకేటాయింపులు రద్దు

**మరికొన్నింటికి మార్పులు చేర్పులు: మంత్రివర్గ ఉపసంఘం కీలక నిర్ణయం**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజధానిలో గతంలో భూములు పొందిన 13 సంస్థలకు కేటాయింపులు రద్దు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. వివిధ కారణాలతో కేటాయింపులు రద్దునకు సబ్ కమిటీ ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో సంస్థలకు భూముల కేటాయింపులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘ సమావేశం సచివాలయంలోని రెండో బ్లాక్ మొదటి అంస్థులో సోమవారం జరిగింది. మంత్రులు పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, టీజీ భరత్, మున్సిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఇతర అధికారులు హాజరయ్యారు. 2014-19 మధ్య కాలంలో అమరావతిలో భూములు కేటాయించిన సంస్థల విషయంలో కొన్ని మార్పులు చేర్పులు చేస్తూ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అనంతరం మంత్రులు నారాయణ, పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడారు. అమరావతిలో గతంలో 131 సంస్థలకు భూములు కేటాయించగా, వీటిలో 31 సంస్థలకు గతంలో చేసిన కేటాయింపులు కొనసాగించాలని నిర్ణయించామని మంత్రి నారాయణ తెలిపారు. మరో రెండు సంస్థలకు గతంలో ఇచ్చిన చోట కాకుండా వేరొక చోట కేటాయింపులు చేస్తూ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. 16 సంస్థలకు గతంలో కేటాయింపులు చేసిన విస్తీర్ణంలో మార్పులు చేయడంతో పాటు వేరొక ప్రాంతాల్లో కేటాయింపులు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక న్యాయపరమైన సమస్యలు పరిష్కరించడానికి ఎనిమిది నెలలు పట్టిందన్నారు. 48 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచి ఇప్పటికే ఏజెన్సీలను ఎంపిక చేసాం. సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం పొందగానే ఆయా సంస్థలతో సీఆర్డీఏ అగ్రిమెంట్లు చేసుకుంటుంది. ఆ వెంటనే రెండు మూడు రోజుల్లో అమరావతి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. రాజధాని కోసం ప్రజల సొమ్ము ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టడం లేదని, కేవలం భూముల అమ్మకాలతో మాత్రమే అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా సీఎం చంద్రబాబు మంచి మోడల్ డిజైన్ చేశారని చెప్పారు. గతంలో అమరావతి కోసం జగన్ లక్ష కోట్లు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించారని విమర్శించారు.

## నేడు ఎస్ఆర్ఎంలో పాపులేషన్ డైనమిక్స్ సదస్సు

**ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు**

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రణాళికా శాఖ అధ్వర్యాన మంగళవారం ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్‌పై సదస్సు జరగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు వివిధ రంగాల ప్రముఖులు, ఐఏఎస్ అధికారులు, ప్రభుత్వ కార్యదర్శులు, జనాభా పెరుగుదల, అభివృద్ధి అంశాలకు చెందిన నిపుణులు విచ్చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగే చర్చా కార్యక్రమాల్లో కూడా వీరు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు సీఎం చంద్రబాబు ప్రభుత్వ అధికారులతో యూనివర్సిటీకి చేరుకుని సదస్సులో ప్రసంగించనున్నారని ప్రణాళికా శాఖ కార్యదర్శి అనంత శంకర్ తెలిపారు. ఈ మేరకు సీఎంకు స్వాగతం పలికేందుకు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్ కుమార్‌తో పాటు సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్, వర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య డి.నారాయణరావు సదస్సు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ప్రణాళిక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీఆర్ అలపర్తి, కార్యదర్శి ఆనంద్, గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా తమ బృందంతో యూనివర్సిటీని సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. సదస్సుకు హాజరవుతున్న సీఎం చంద్రబాబు నాయుడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సుమారు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా రెండు నూతన హాస్టల్ భవనాలను ప్రారంభించనున్నారు.

## ప్రపంచం మెచ్చిన క్యాన్సర్ వైద్యుడు డాక్టర్ నోరి

- సీఎం చంద్రబాబు ప్రశంస
- ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తున్నట్లు ప్రకటన
- 'మంటాడ టు మ్యాన్ హ్యాటన్' గ్రంథావిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ప్రపంచం మెచ్చుకున్న ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు (అంకాలజిస్ట్) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మన వాడు కావడం గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలో డాక్టర్ నోరి దత్తాత్రేయుడి ఆత్మకథ 'మంటాడ టు మ్యాన్ హ్యాటన్' గ్రంథాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెస్కో విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతమైన పమిడిముక్కల మండలం మంటాడలో జన్మించిన డాక్టర్ నోరి ఇక్కడ విద్యనభ్యసించి ప్రపంచంలోనే ప్రముఖ వైద్యుడుగా ఎదిగారన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి తల్లిదండ్రులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌టీఆర్ కుటుంబంతో డాక్టర్ నోరికిసన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఆ తర్వాత తనకు ఆయనతో పరిచయమైందని, మంచి చనువు ఉందన్నారు. అనేక అవార్డులు అందుకున్న డాక్టర్ నోరీని ఇటీవల ఆమెరికన్ సొసైటీ ట్రిబ్యుట్ లైఫ్ అవార్డుతో సత్కరించిందన్నారు. డాక్టర్ నోరీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున క్యాన్సర్ వైద్యానికి సలహాదారుగా నియమిస్తున్నట్లు సభాముఖంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. డాక్టర్ నోరీ మాట్లాడుతూ... తన మాతృమూర్తి, షిరిడీ సాయి ఆశీస్సులతో తాను ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. అమెరికాలో పేరు మోసిన వైద్యుడిగా ఉన్నప్పటికీ ఈ ప్రాంతవాసిని అని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానని చెప్పారు. తన మాతృమూర్తి బంగారు గాజులు అమ్మి తనను చదివించిందని, ఆ తర్వాత తన మొదటి నెల జీతంతో గాజులు చేయించానని చెప్పారు. అమెరికా వెళ్లడానికి మొదట తన స్నేహితుడు వాసిరెడ్డి చంద్రశేఖర్ ఆర్థిక సాయం చేసిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. నాడు అమెరికా వెళ్లిన సమయంలో తన పర్సులో కేవలం 15 డాలర్లు మాత్రమే ఉన్నాయన్నారు. గతంలో భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి అమెరికాలో శస్త్ర చికిత్స చేయడం జరిగిందని, ఆ తర్వాత ఆయన 18 సంవత్సరాలు జీవించారన్నారు.ఎన్టీఆర్ సతీమణి బసవతారకానికి సైతం అక్కడ వైద్యసేవలు అందించానని ఇలా అనేక మంది ప్రముఖులకు వైద్య సేవలందించినట్లు చెప్పారు. క్యాన్సర్ నిరోధానికి ఏపీలో ఏర్పాటు చేస్తున్న చికిత్సా విధానం భారతదేశానికి రోల్ మోడల్‌గా ఉండాలని భావిస్తున్నానని, ఇందు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. డాక్టర్ నోరి ఆత్మకథ వ్యక్తిత్వ వికాస గ్రంథంగా భావించాలన్నారు. యువతకు ఈ గ్రంథం స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, పద్మశ్రీ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కొణతాల రామకృష్ణ, ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సాయంతో కలెక్టరేట్‌ల నిర్మాణం: అనగాని సత్యప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో దాతల సహకారంతో కలెక్టరేట్లు నిర్మించాలనే ఆలోచన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అవసరమైన చోట రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలను కూడా అదేవిధంగా నిర్మిస్తామని అన్నారు. శాసన సభలో సోమవారం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ల కార్యాలయాల నిర్మాణంపై సభ్యులు కూన రవికుమార్, బోనెల విజయచంద్ర, పల్లె సింధూర రెడ్డి, ప్రశాంతి రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నందున దాతల సహాయంతో నిర్మాణాలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు పశ్చిమ గోదావరి కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణం కోసం ఒక ప్రతిపాదనతో ముందుకు వచ్చారని తెలిపారు. కబ్జా చేసిన భూమిని వెనక్కి తీసుకుని దాంట్లో కలెక్టరేట్ కార్యాలయాన్ని నిర్మిద్దామని, ఇందుకయ్యే ఖర్చులో సగం దాతల నుంచి సేకరించి, సగం రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ప్రతిపాదన తీసుకొచ్చారని చెప్పారు. మిగిలిన చోట్ల కూడా దాతల సహాయంతో కలెక్టరేట్ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నామని, అయితే దాతల నుంచి నిధులు ఎలా సేకరించాలి, ఎలా ఖర్చు పెట్టాలనే అంశాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. జిల్లాల విభజనలో గత ప్రభుత్వంలో చోటుచేసుకున్న లోపాలను సరి చేస్తున్నామని మంత్రి అనగాని తెలిపారు.

## యూపీలో జర్నలిస్టు హత్య దారుణం: ఐజేయూ

హైదరాబాద్/చండీగఢ్: ఉత్తర ప్రదేశ్‌లో దైనిక్ జాగరణ్ విలేకరి రాఘవేంద్ర బాజ్‌పాయ్ దారుణ హత్యను ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తీవ్రంగా ఖండించింది. పంజాబ్‌లోని మొహాలీ నివాసి అయిన బాజ్‌పాయ్ (35) ... సీతాపూర్ పట్టణంలో దైనిక్ జాగరణ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. శనివారం మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగులు ఆయనపై తుపాకీతో కాల్పులు జరిపి హత్య చేశారు. ఈ ఘాతుకాన్ని ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి , సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దేశంలో జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఇటీవల కాలంలో అనేక దాడులు జరిగాయన్నారు. పట్టపగలు ఓ జర్నలిస్టును కాల్చి చంపిన ఈ ఘటన అసాంఘిక శక్తులు దేనికీ భయపడకుండా పేట్రేగిపోతున్నాయడానికి నిదర్శనమని ఐజేయూ నాయకులు పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాల్సిన అవసరాన్ని ఈ ఘటన ఎత్తిచూపుతోందని తెలిపారు. వెంటనే పరిస్థితిని సమీక్షించి... జర్నలిస్టుల భద్రతను నిర్ధారించడానికి చర్యలు ప్రారంభించాలని ఐజేయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, బాజ్‌పాయ్ కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని వారు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు దక్కేవరకు పోరాటాలు

- ఉపాధి హామీలో రాజకీయ జోక్యం సహించం
- ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్
- బీకేఎంయూ జాతీయ ఉపాధ్యక్షులుగా డి.రాజా ఏకగ్రీవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/దిల్లీ: ఆంధ్ర ప్రదేశ్‌లో పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరేవరకు ఉద్యమాలు ఆగవని, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీల అమలు కోసం దశలవారీగా ఆందోళనలు చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అయినప్పటికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో నిర్లక్ష్యాన్ని సహించబోమన్నారు. భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు దిల్లీలోని అజయ్ భవన్‌లో 8,9,10 తేదీల్లో నిర్వహించారు. చివరి రోజు సోమవారం ఆంధ్ర ప్రదేశ్ నుంచి నివేదికను ప్రవేశ పెట్టారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ఉపాధి హామీలో రాజకీయ జోక్యం ఎక్కువైనందు వల్లే వలసలు విపరీతంగా పెరిగాయని, వలసలు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆవుల శేఖర్ విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో వలసలకు వక్ర భాష్యం చెబుతున్నారని అన్నారు. ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు సరిపడా కేటాయించలేదని, అయినా కూటమి ప్రభుత్వం నోరు మెదపక పోవడం దారుణమన్నారు. ఇప్పటికీ ఉపాధి హామీలో 9 వారాల బకాయిలు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి సకాలంలో డబ్బులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని అన్నారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నవంబరు నుంచి ఇప్పటివరకు సీపీఐ, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరేంతవరకు తమ ఉద్యమాలను ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ పట్ల 2014 నుంచీ చిన్నచూపు చూస్తోందని, విభజన హామీలు ఏవీ అమలు చేయలేదన్నారు. పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు ఇప్పటికీ రెవెన్యూ హక్కులు కల్పించడం లేదని తెలిపారు. భూ సంస్కరణల చట్టం ప్రకారం సీలింగ్ పెట్టి ప్రభుత్వ భూములు పేదలకు పంచి అన్ని హక్కులు కల్పించాలని ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి లండ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ జాతీయ సమితి సమావేశాల్లో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాను బీకేఎంయూ ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆవుల శేఖర్ తెలిపారు. ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఆయన వివరించారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడానికి ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, భూ సంస్కరణల చట్టం, భూ సీలింగ్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని, కంపెనీల పేరుతో వేలాది ఎకరాలు అప్పనంగా అప్పచెప్పకూడదని, పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేసి, పడావుగా ఉన్న ప్రభుత్వ భూములు సాగులోకి తీసుకురావాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో నాలుగు లక్షల 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, ఉపాధి హామీ చట్టంలో పొందుపరిచిన అన్నింటిని ఉపాధి కూలీలకు అందజేయాలని తీర్మానించినట్లు తెలిపారు. ఉపాధిలో అవినీతి, అక్రమాలను అరికట్టాలని, రాజకీయ జోక్యాన్ని నిలువరించాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందేనని, అన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో రాజకీయ సదస్సులు నిర్వహించాలని సమావేశం తీర్మానించిందని చెప్పారు. ఈనెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన 'దేశాన్ని రక్షించండి, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' అనే పిలుపులో వ్యవసాయ కార్మికులు పాల్గొనాలని, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం, ఉద్యమ నిధి ప్రతి సంవత్సరం చెల్లించాలని, గ్రామ సంఘాలను ఏర్పాటు చేసి మండల, జిల్లా కమిటీలను బలోపేతం చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, పేదల నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తీసుకురావాలని, సామాజిక, ఆర్థిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ చేపట్టాలని, కులగణన చేపట్టి ప్రైవేట్ ప్రభుత్వ రంగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లపై జూన్ 10వ తేదీన దేశవ్యాప్తంగా బీకేఎంయూ ఆందోళనలకు పిలుపునిచ్చిందని తెలిపారు.

## శ్రీచైతన్య కళాశాలలపై ఐటీ పంజా

**ఏకకాలంలో భారీగా సోదాలు**

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ వ్యాప్తంగా శ్రీచైతన్య జూనియర్ కళాశాలలపై ఐటీ దాడులు కొనసాగాయి. తెలుగు రాష్ట్రాలతోపాటు దిల్లీ, చెన్నై, ముంబై, బెంగుళూరులో ఈ సోదాలు జరిగాయి. కళాశాలల్లో పెద్ద మొత్తంలో అక్రమ లావాదేవీలు కొనసాగినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. విద్యార్థుల నుంచి పెద్దఎత్తున డబ్బు తీసుకుని, ఆదాయ పన్ను ఎగవేసినట్లు కనుగొన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ తయారు చేసి లావాదేవీలు నిర్వహించినట్లు తెలిసింది. తెలంగాణలోని మాదాపూర్ శ్రీచైతన్య కళాశాల విద్యా సంస్థల ప్రధాన కార్యాలయంలోను ఈ సోదాలు జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లో శ్రీచైతన్య కళాశాలతోపాటు మరికొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇంటర్ విద్యతోపాటు ఐఐటీ, నీట్ కోచింగ్‌లను ఇంటిగ్రేటెడ్‌గా బోధిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ కంటే... జేఈఈ, నీట్ శిక్షణకే అధికంగా ప్రాధాన్యతిస్తారు. కార్పొరేట్ విద్యా సంస్థల ప్రకటనలతో విద్యార్థుల్ని, తల్లిదండ్రుల్ని ఆకర్షితులను చేస్తున్నాయి. పదో తరగతి పరీక్షలు ముగిసిన వెంటనే ఆయా విద్యార్థుల వివరాలను సేకరించి... ప్రత్యేక పీఆర్వో వ్యవస్థ ద్వారా వారిని కార్పొరేట్ కళాశాలల్లో చేర్పించడం ఆనవాయితీగా మారింది. ఒక్కో విద్యార్థి నుంచి ఏడాదికి ఇంటర్, జేఈఈ, నీట్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్ కోసం రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు డే స్కాలర్‌కు ఫీజులు వసూలు చేస్తున్నారు. వాటితోపాటు హాస్టల్‌కు మరో రూ.రెండు లక్షలకుపైగా ప్రతేటా ఫీజులు దండుకుంటున్నారు. ఈ ఫీజులను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలుగుతోంది. ఐటీ శాఖకు పెద్దఎత్తున ఫిర్యాదులు అందడంతో దేశ వ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య కళాశాలల కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఇంటర్‌లో చేరిన విద్యార్థులకు ప్రారంభం నుంచి ఇంటర్ సిలబస్ చెప్పకుండా..కేవలం పరీక్షల నోటిఫికేషన్ వచ్చిన నెల రోజుల ముందే మెటీరియల్ ఇచ్చి బట్టీ విధానాన్ని అవలంభిస్తున్నారు. మొత్తం ఇంటర్ విద్యా సంవత్సరమంతా జేఈఈ, నీట్ పరీక్షలకే సరిపెడుతున్నారు. ఇంటర్ విద్యపై అసలు దృష్టి పెట్టకపోవడంతో విద్యార్థులు యాంత్రికంగా తయారైపోతున్నారు. ఆయా కార్పొరేట్ కళాశాలల్లో అక్కడక్కడా వచ్చిన ర్యాంకులను విస్తృతంగా ప్రచారం చేసి... తమ వైపునకు తిప్పుకుంటున్నారు. శ్రీచైతన్య తరహాగానే మిగిలిన కార్పొరేట్ ఇంటర్ కళాశాలల ఫీజుల వసూలు విధానంపైనా ఐటీ శాఖ అధికారులు దృష్టి పెట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.